Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 73 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 ఏప్రిల్ 2023 బుధవారం పేజీలు : 4

### ఆ ఆరోపణలకు ప్రజాకోర్టులోనే బదులిస్తాం: సీఎం

బెంగళూరు : కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ప్రజాకోర్టులోనే బదులిస్తామని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై స్పష్టం చేశారు. బెంగళూరు ఆర్‌టీ నగర్‌లోని తన నివాసంలో జనతాదర్శన్ నిర్వహించి ప్రజల సమస్యలను ఆలకించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 40 శాతం కమీషన్, పేసీఎం, సేసీఎం వంటి కాంగ్రెస్ అభియానలకు అర్థం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగిన పలు అక్రమాలు, అవినీతి చిట్టాలను కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీకి ఆధారాలతో సహా పంపిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉనికి కోసం కాంగ్రెస్ తంటాలు పడుతోందని, జనసంకల్ప యాత్రలకు లభిస్తున్న స్పందనతో కాంగ్రెస్ నేతల్లో భయం ఆవరించిందన్నారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందని, కులాలు మతాలకు అతీతంగా పాలన సాగిస్తూ ఎవరికీ, ఏ విషయంలోనూ వివక్షత చూపడం లేదని ఆయన వివరించారు.

### 3లక్షల మందికి పౌరసత్వం.. కెనడా సర్కార్ యోచన..

విదేశీయులకు ఇచ్చే పౌరసత్వం విషయంలో కెనడా సర్కార్ కీలక యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఏకంగా 3 లక్షల మందికి కొత్తగా పౌరసత్వం ఇవ్వాలని యోచిస్తుందట. 2023 మార్చి నాటికి ఈ మూడు లక్షల పౌరసత్వాలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు అక్కడి మీడియా పేర్కొంది. కాగా, ఈ నిర్ణయంతో ఎక్కువగా లాభపడేది భారతీయులేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అక్కడి ప్రముఖ ఓ న్యూస్ ఏజెన్సీ పేర్కొన్న వివరాల ప్రకారం.. 2023 మార్చి 31 నాటికి ఇప్పటికే పెండింగ్ లో ఉన్న మొత్తం 2,85,000 దరఖాస్తులను పరిశీలించడంతో పాటు 3లక్షల కొత్త పౌరసత్వాలను జారీ చేయాలని ఇమ్మిగ్రేషన్, శరణార్థులు మరియు పౌరసత్వం కెనడా సిఫార్సు చేసిందట.

# మధ్య తరగతిపై ధరల మోత!



## విలవిల్లాడుతున్న సామాన్యుడు - 8 ఏండ్లలో 60-75% పెరిగిన రేట్లు
## పరుగులు తీస్తున్న పెట్రోల్, డీజిల్ - రెండింతలు పెరిగిన ఇంటి ఖర్చులు
## అడుగంటుతున్న ప్రజల ఆదాయాలు - జనాల్లో పడిపోతున్న కొనుగోలు శక్తి

హైదరాబాద్ : కేంద్రంలోని మోదీ సర్కారు అవలంబిస్తున్న ఆర్థిక విధానాలతో నిత్యావసరాలు మొదలు పెట్రోల్ రేట్ల దాకా అన్నీ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ ప్రభావం ఎక్కువగా మధ్యతరగతి మీదే పడుతున్నది. ఫలితంగా సగటు పౌరుడు రోజురోజుకు పేదరికంలోకి జారుకొంటున్నాడు. కేంద్ర వాణిజ్య వ్యవహారాల శాఖ, కేంద్ర ఆర్థిక శాఖ, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ, తదితర శాఖలు వెల్లడిస్తున్న గణాంకాలే ఉదాహరణే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశ జనాభాలో మధ్య తరగతి జనాభా.. 29 శాతం. జాతీయ ఆదాయంలో వారిదే 79 శాతం వాటా. దేశీయ వస్తు ఉత్పత్తుల వినియోగదారుల్లో 70 శాతం వారే ఉన్నారు. అంటే.. దేశ ప్రగతిలో వారి పాత్ర ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర అసమర్థ విధానాల ఫలితంగా ఇప్పుడు దేశంలోని మధ్యతరగతి కొనుగోలు శక్తి నానాటికీ దిగజారిపోతున్నది. నలుగురు కుటుంబసభ్యుల సగటు ఖర్చు ఎనిమిదేండ్లలో రెండింతలైంది. నిత్యావసర సరుకులు, రవాణా ఖర్చులు, విద్య, వైద్యం, అద్దె.. ఇలా అన్ని ఖర్చులూ డబుల్ అయ్యాయి. అదే స్థాయిలో ఆదాయం పెరగకపోవటం, సబ్సిడీల్లో కేంద్రం కోతలు విధించటంతో కుటుంబ అవసరాలను కూడా తీర్చుకోలేని దుస్థితికి మధ్యతరగతి ప్రజలు చేరుకొన్నారు. కొనుగోలు శక్తిని కోల్పోతూ క్రమంగా పేదరికంలోకి జారుతున్నారు. కరోనా కూడా తోడవ్వటంతో మధ్యతరగతి బడ్జెట్ తారుమారైంది. దేశంలో ఏడాది కాలంలో ఏకంగా 36 లక్షల మంది పేదరికంలోకి చేరినట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయి. గతంలో జీతంలో కనీసం 10 శాతం పొదుపు చేసే అవకాశం ఉండగా, ప్రస్తుతం అప్పులతో నెట్టుకు రావాల్సిన దుస్థితి తలెత్తింది.

**బీజేపీ అసమర్థ ఆర్థిక విధానాలు, సబ్సిడీల్లో కోతలు :** డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగి, సరుకు రవాణా ఖర్చు లు పెరిగాయి. దాని ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై పడుతున్నది. ద్రవ్యోల్బణం రేటు తగ్గుతున్నా సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నిత్యావసర సరుకుల ఎగుమతులపై ఆంక్షలను ఎత్తివేయడం, దిగుమతులపై భారీగా సుంకాలను విధి ంచడం. దేశంలో పప్పులు, నూనె గింజలు మినహాయించి మిగతా అన్ని రకాల వస్తువులు సమృద్ధిగా ఉన్నాయి. అయినా విదేశీ మారక ద్రవ్యం పెంచుకొనేందుకు కేంద్రం వాటి ఎగుమతులను ప్రోత్సహిస్తున్నది. ఫలితంగా దేశీయంగా వాటి ధర పెరుగుతున్నది. దిగుమతులపై సుంకాలు విధించటంతో పప్పులు, నూనెల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. బీజేపీ ప్రభుత్వం ఆహార సబ్సిడీల్లో కోతలు విధిస్తున్నది. 2022-23 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలో 28 శాతం, ఎరువుల సబ్సిడీలో 25 శాతం, ఇంధన సబ్సిడీలో సుమారు 11 శాతం మేర కోత విధించింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే.. విలా స వస్తువులు, ఇంటర్నెట్ డాటా ధరలు తగ్గుతుండ డం కేంద్ర అసమర్థ ఆర్థిక విధానానికి నిదర్శనం.

**ఇవే విధానాలు కొనసాగితే శ్రీలంక లాంటి పరిస్థితే :** కేంద్ర విధాన వైఫల్యాల వల్లే నిత్యావసర సరుకులు పెరుగుతున్నా యి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు ఉద్దీపన ప్యాకేజీలు లేవు. ఎఫ్‌సీఐలో 86 మిలియ న్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. పప్పులు, నూనెగింజలు మినహా ఇతర పంటలన్నీ దేశీయ అవసరాలకు మించి ఉన్నా యి. అయినా కేంద్రం నిర్వహణ లేమితో ధరలు పెరిగిపోతున్నాయి. ఇవే విధానాలు కొనసాగితే దేశం శ్రీలంకలా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. **– డీ పాపారావు, ఆర్థికవేత్త**

**ట్రాన్స్‌పోర్టు ఖర్చులువిపరీతంగా పెరిగాయి :** పెట్రోల్, డీజిల్ ధరలు పెరగటం వల్ల ట్రాన్స్‌పోర్టు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రవాణా ఖర్చులు తగ్గితే ఆటోమెటిక్‌గా సరుకుల ధరలు తగ్గుతాయి.

**– నవీన్,కిరాణ వ్యాపారి, ఎర్రగడ్డ**



## కలిసి పోరాడుదాం...

హైదరాబాద్: వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల.. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంను నాంపల్లిలోని టీజేఎస్ పార్టీ కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ పేపర్ లీక్, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు కలసి పోరాటంపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య యువతను పట్టి పీడిస్తోందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తే మంచిదని తన అభిప్రాయమన్నారు. టి సేవ్ ఫోరం పేరుతో అందరం కలిసి పోరాడుదామని పిలుపిచ్చారు. నిరుద్యోగులకు భరోసా కోసమే టి సేవ్ ఫోరమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. షర్మిల వ్యాఖ్యలపై కోదండరాం సానుకూలంగా స్పందించారు. పార్టీలో చర్చించి నిర్ణయం చెబుతానన్నారు. కోదండరాం మాట్లాడుతూ.. నిరుద్యోగుల తరపున కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరితో కలిసి పోవాలనేది తమ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎవరితో కలిసి ఎలా పోరాటంలో ముందుకు వెళ్ళాలనేది రాష్ట్ర కమిటీలో చర్చించుకుంటామన్నారు. రాష్ట్రంలో పేపర్ల లీకేజీ విద్యార్థుల్లో గందరగోళం నెలకుంటోందన్నారు. విద్యార్థుల్లో టెన్షన్ మొదలయ్యిందని.. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో అడుకుంటుందని కోదండరాం మండిపడ్డారు. 10వ తరగతికి సంబంధించి నిన్న ఒకటి, మంగళవారం మరొకటి పేపర్ లీక్ కావడం ప్రభుత్వ నిర్లక్షమేనని దుయ్యబట్టారు. ఇవాళ సాయంత్రం అఖిలపక్ష ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామని.. భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని కోదండరాం స్పష్టం చేశారు.



## బీఆర్ఎస్‌తో పొత్తుపై క్లారిటీ

ఢిల్లీ: టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పార్టీ పొత్తు విషయంపై కీలక వ్యాఖ చేశారు. తాను పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్నని రోజులు బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. అంతేకాక బీఆర్ఎస్‌తో పొత్తు వుండదని రాహుల్‌గాంధీ చాలా క్లియర్‌గా చెప్పారని తెలిపారు. బీజేపీ దగ్గర విపరీతంగా డబ్బులు, అధికారం ఉందన్నారు. వార్డు మెంబర్ ఎన్నికలు వున్నా.. ప్రధాని మోదీ, అమిత్ షా వస్తారని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ పదేళ్లు ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. కేసీఆర్ దృత రాష్టుడి కౌగిలికి కాంగ్రెస్ బలి కాదాల్చుకొలేదన్నారు. పంజాబ్‌లో తమ ప్రభుత్వం రాకుండా ఆప్‌కి కేసీఆర్ డబ్బులు ఇచ్చాడని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

కర్ణాటక ఎన్నికల ప్రభావం కచ్చితంగా ఉందన్నారు. మహారాష్ట్ర లో మహా వికాస్ అంగాడి ప్రభుత్వం రాబోతుందని, కేసీఆర్ బీజేపీ ఎజెండాను అక్కడ అమలు చేస్తుందన్నారు. తెలంగాణలో కెసిఆర్ లక్ష కోట్ల అవినీతి చేశారని, ఒక్క కేసు కూడా బీఆర్ఎస్ మీద పెట్టలేదన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌పై పెట్టిన కేసు తప్ప కేసీఆర్‌పై పెట్టిన కేసు, కవిత అరెస్ట్ పెద్ద ప్రభావం ఉండదన్నారు. తెలంగాణలో పరిపాలన లేదని, ప్రభుత్వం కుప్ప కూలిపోయిందని విమర్శించారు.

# ఉద్యోగ నియాకాలకు చక.. చక... అడుగులు



## అన్నమాట ప్రకారం

# సూపర్‌ఫాస్ట్ స్పీడ్‌లో పనులు చక్కబెడుతున్న కేసీఆర్ సర్కార్

## ఆ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఆర్థికశాఖ!!
## హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు
## కోచింగ్ సెంటర్లు, లైబ్రరీలు హౌస్‌ఫుల్

నిరుద్యోగులకు ఊరట కల్పిస్తూ, భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న జాబ్ నోటిఫికేషన్ల నిర్ణయంతో ఇప్పటికే నిరుద్యోగులు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు రానున్నాయని సీరియస్ గా ప్రిపేర్ అవుతున్నారు. ఇక ఏ శాఖలో ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయి? ఎన్ని పోస్టులను భర్తీ చేయనున్నారు? దానికి కావలసిన విద్యార్హతలేమిటి? చదవలసిన సబ్జెక్టులు ఏమిటి అన్న దానిపై నిరుద్యోగులు పెద్ద కసరత్తే చేస్తున్నారు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. తొలివిడతగా 30 వేల 453 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇప్పటికే అనుమతులు ఇచ్చిన ఆర్థిక శాఖ తాజాగా మరో 3,334 ఉద్యోగ నియామకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన జీవోలను కూడా జారీ చేసింది తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ. ఫైర్ సర్వీసు, అటవీశాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ లో ఖాళీలను భర్తీ చేయడానికి అనుమతినిచ్చింది. దీంతో నిరుద్యోగులలో సంతోషం వ్యక్తమవుతుంది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో 80 వేల 39 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా వెల్లడించిన విషయం తెలిసిందే.

**అటెండర్ నుండి ఆర్టీవో వరకు అన్ని ఉద్యోగాల భర్తీకి కేసీఆర్ నిర్ణయం...** అటెండర్ నుండి ఆర్టీవో వరకు స్థానికులకే అవకాశం ఇస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటించిన సమయంలో సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. నీళ్లు నిధులు నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో శాశ్వత ప్రాతిపదికన తెలంగాణ నిరుద్యోగులకు న్యాయం చేస్తామని సీఎం కేసీఆర్ తెలిపారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుని జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నామని కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటి వరకు లక్ష 30 వేల ఉద్యోగాలను భర్తీచేశామనిపేర్కొన్న కెసిఆర్22 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, ఇంకా లక్ష 50 వేల ఉద్యోగాలను నోటిఫై చేశామని వెల్లడించారు. మొత్తం ప్రత్యక్ష నియామక ఖాళీలు 91,142 ఉన్నాయనిసీఎం కేసీఆర్ వెల్లడించారు.

**జాబ్ నోటిఫికేషన్స్ తో సీరియస్ ప్రిపరేషన్ లో నిరుద్యోగులు ...** రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పోగా 80,039 ఖాళీలు ఉన్నట్లుగా పేర్కొన్న కేసీఆర్ వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని,స్థానికులకే అవకాశం ఇస్తామని తేల్చిచెప్పారు.సీఎం కేసీఆర్ ప్రకటన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగార్థులు కోచింగ్ సెంటర్లకు, ఉచిత శిక్షణ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. పోలీస్ శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జిల్లాల వారీగా జిల్లా యువకులకు ఉచిత శిక్షణను అందిస్తున్నారు. ఇక ఇప్పటికే యూనివర్సిటీ లైబ్రరీలు, లైబ్రరీలలో ఉద్యోగార్థులు సీరియస్ గా చదువుతున్నారు.

**ఉద్యోగాల భర్తీ నేపథ్యంలో కిటకిటలాడుతున్న కోచింగ్ సెంటర్లు...** కరీంనగర్ కలెక్టర్ కర్ణన్, పోలీస్ కమిషనర్ సత్యనారాయణ ఉచిత శిక్షణ ఇచ్చే అభ్యర్థుల కోసం అర్హత పరీక్ష నిర్వహించాలని నిర్ణయించగా 6500 మంది యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు అంటే, జిల్లాల వారీగా ఎంత పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఒక్క పోలీస్ శాఖ నుండి కాదు ఇతర శాఖల్లోనూ నోటిఫికేషన్లు రానున్న నేపథ్యంలో నిరుద్యోగులు ప్రిపరేషన్ లో ఫుల్ బిజీగా ఉన్నారు. పలు అకాడమీలు కిటకిటలాడుతున్నాయి. ఎలాగైనా జాబ్ కొట్టాలన్న తపనతో కష్టించి చదువుతున్నారు.

# సంపాదకీయం

## సోనియా.. వ్యూహాలు మారుతున్నాయా?

జాతీయ రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితిలోనూ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారును పక్కన పెట్టి తాము జెండా ఎగరేయాలని.. భావిస్తున్న కాంగ్రెస్ ఈ క్రమంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్.. ఉరఫ్ పీకేను పార్టీలో చేర్చుకునేందుకు నిర్ణయించుకుంది. దీనికి తగిన ముహూర్తం కూడా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కాంగ్రెస్కు వచ్చే ఎన్నికల్లో లక్ష్యాలను కూడా పీకే నిర్ణయించారు. 370 నుంచి 400 స్థానాలు లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగాలని ఆయన నిర్దేశించారు. అయితే..ఈ లోగానే సోనియాతో పీకే వరుస భేటీలు.. ఆసక్తిగా మారాయి. ఒకవైపు ప్రాంతీయ పార్టీల కూటములు రెడీ అవుతున్నపథ్యంలో మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ కూడా .. మరింత పుంజుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడం జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. తాజాగా మహారాష్ట్రకు చెందిన శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సైతం బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించి జాతీయ రాజకీయాలపై చర్చించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపత్యంలో కాంగ్రెస్ మరింతగా తన వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీని బలోపేతం చేసి 2024 ఎన్నికలకు సన్నద్ధం అయ్యేలా సోనియా గాంధీ పావులు కదుపుతున్నారు. ఈనేపథ్యంలోనే సోనియా పీకేతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. శనివారం(ఏప్రిల్ 16న) కాంగ్రెస్ సీనియర్ నాయకులతో భేటీ అయిన ప్రశాంత్ కిషోర్.. ఆ సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికలపై తాను రచించిన ప్రణాళికలను పార్టీ నేతలతో పంచుకున్నారు. అదే సమయంలో తాను కాంగ్రెస్ లో చేరే అంశాన్ని కూడా సీనియర్ నాయకుల వద్ద ప్రస్తావించారు. దీంతో మళ్లీ వారం పది రోజుల వరకు మళ్లీ ఎలాంటి మీటింగు ఉండదని అనుకున్న తరుణంగా.. అనూహ్యంగా సోమవారం (ఏప్రిల్ 18) సోనియా ఆధ్వర్యంలో మరోసారి పార్టీ సినియర్ క్యాడర్ తో భేటీ జరిగింది. దీనికి కూడా పీకే వచ్చారు. ఈ క్రమంలో ఈ ఏడాది చివరలో జరగనున్న గుజరాత్ హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలకు వ్యూహరచన చేసినట్లు తెలిసింది. ఢిల్లీలో సోనియా నివాసంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కెసి వేణుగోపాల్ అంబికా సోని ప్రియాంక గాంధీ వాద్రా ముకుల్ వాస్నిక్ జైరాం రమేష్ పి చిదంబరం రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు హాజరయ్యారు. నాలుగు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో రానున్న ఎన్నికల వ్యూహంలోని వివిధ కోణాలపై నేతలు చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆచితూచి వ్యవహరించాలని చెప్పుకొచ్చిన ప్రశాంత్ కిషోర్ ముందుగా పార్టీకి బలం ఉన్న నియోజకవర్గాల్లోనే అభ్యర్థులను బరిలో దించాలని ప్రతిపాదించారు. తద్వారా ఆయా అభ్యర్థులు గెలిస్తే ఆ విజయం తాలూకు ప్రభావం ఇతర ప్రాంతాల్లోనూ కనిపిస్తుందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. మొత్తానికి కాంగ్రెస్ గతానికి భిన్నంగా దూసుకుపోవడం ఖాయంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు.

# పరిశ్రమలు.. పక్కా భవనాలకు రైతుబంధు



ఆసిఫాబాద్: నిరుపేద రైతులకు పంట పెట్టుబడి కోసం ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే జిల్లాలో ఇది భారీగా దుర్వినియోగం అవుతోంది. పెద్ద భవనాలు, పరిశ్రమలకు, భూమికి మించి పట్టాలో ఎక్కువగా విస్తీర్ణంలో నమోదైన, దస్త్రాల్లోనే భూములున్న వాటికి సైతం సహాయం ఏటా రెండుసార్లు వస్తోంది. సాగు భూముల గురించి ఏటా సర్వే చేసి, అనర్హులను తొలగించాల్సిన అధికారులు పట్టనట్లుగా ఉండటంతో ప్రజాధనం వృథా అవుతోంది.ప్రభుత్వం యాసంగి, వానాకాలం పంటలకు ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండుసార్లు పెట్టుబడి ఆర్థిక సహాయం అందిస్తుంది. పేర్లు, చిరునామాల తప్పులు, విరాసత్ కాకపోవడం, విస్తీర్ణంలో పొరపాట్లు తదితర కారణాలతో.. రైతులు వీటిని సరిచేయాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. వీరి సమస్య పరిష్కారం కాకపోవడం, ధరణిలో ఆప్షన్లు లేకపోవడంతో అర్హులైనా.. రైతుబంధు రావడం లేదు. మరోవైపు వ్యవసాయం చేయకున్నా కొందరు బడాబాబులకు ఈ సహాయం వస్తుండటంతో.. అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలాశయాల ఏర్పాటులో భాగంగా ముంపునకు గురైన గ్రామాలకు ఇతర చోట్ల భూములు కొని పునరావాసం కల్పించారు. వీటిని విక్రయించిన రైతుల పేర్లు ఇప్పటికీ తొలగించకపోవడంతో.. వారికి రైతుబంధు వస్తోంది. వాస్తవంగా అక్కడ నివాస సముదాయాలు ఉన్నాయి. జిల్లాలోని వట్టివాగు, కుమురం భీం జలాశయాలకు సంబంధించి పదుల సంఖ్యలో పునరావాస గ్రామాలు ఉన్నాయి.

సాగు భూములను వ్యవసాయేతర పనులకు వినియోగిస్తే.. నాలా అనుమతులు తీసుకోవాలి. అనేక చోట్ల వీటిని తీసుకోకపోవడంతో వివిధ పరిశ్రమలు ఉన్నా, అవి ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే ధరణి వెబ్‌సైట్‌లో చూపిస్తోంది. వీటికి రైతుబంధు వస్తోంది. ఏటా వ్యవసాయ అధికారులు వారి పరిధిలోని వ్యవసాయ, సాగులో లేని భూముల వివరాలు సేకరించాలి. వీటిని రాష్ట్ర కమిషనరేట్‌కు పంపితే వారు రైతుబంధు జాబితా నుంచి తొలగిస్తారు. కానీ ఈ విధానం అమలులో జాప్యం జరుగుతోంది.

ఇదీ లెక్క..జిల్లాలో గత వానాకాలం సీజన్‌లో పట్టా పాస్ పుస్తకాలున్న భూవిస్తీర్ణం 3.79 లక్షల ఎకరాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వానాకాలం మంజూరైన సహాయం రూ.198.57 కోట్లు. ఎకరానికి రూ.5 వేల చొప్పున లెక్కకడితే రూ.3.97 లక్షల ఎకరాలకు నిధులు విడుదలయ్యాయి. అంటే 18వేల ఎకరాలకు అదనంగా వచ్చాయి. రెవెన్యూ, వ్యవసాయశాఖ వద్ద ఉన్న రైతుబంధు వివరాలకు పొంతన లేకుండా పోతోంది.

వట్టివాగు జలాశయ నిర్మాణంలో భాగంగా.. ముంపునకు గురైన వారికి ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి వద్ద పునరావాసం కల్పించారు. 350 జనాభా కలిగిన ఈ గ్రామంలో 65 వరకు నివాసాలున్నాయి. ఇది సర్వే నం.209తో ఓ వ్యక్తి మీద ఇప్పటికి ఉండగా, పదెకరాల వరకు సహాయం అందుతోంది. జిల్లా వ్యాప్తంగా సింగరేణి, జలాశయాల పునరావాస గ్రామాలు 35 వరకు ఉన్నాయి.

ఆసిఫాబాద్ పట్టణంలో సర్వే నం.45లో ఉన్న జిన్నింగ్ మిల్లు ఇది. నాలుగెకరాల విస్తీర్ణంలో ఉండగా.. ఈ సర్వే నంబర్‌లో 15 ఎకరాల భూమి ఉంది. నాలా అనుమతులు ఇస్తే ధరణిలో వ్యవసాయ భూమిగా నమోదు కాదు. అలాంటిది పట్టణంలో ఉన్న జిన్నింగు మిల్లులో ఒక్కటి సైతం నాలా అనుమతులు తీసుకోలేదని స్పష్టమవుతోంది. అన్ని సాగు భూములుగానే ఉన్నాయి. అంటే జిల్లా వ్యాప్తంగా 15 జిన్నింగు మిల్లులు ఉండగా, సుమారు 150 ఎకరాల పరిశ్రమల భూములకు రైతుబంధు వస్తున్నట్లే.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖాధికారి

పరిశ్రమలు, సాగు భూములు కాకుండా ఉన్న వాటికి రైతుబంధు వస్తున్న ప్రదేశాల్లో అధికారులతో సర్వే చేయిస్తున్నాం. ఏటా కమిషనరేట్‌కు పంపిస్తున్నాం. వాటిని రైతుబంధు జాబితా నుంచి తొలగిస్తాం.

# గని మాట.. సందర్శకుల బాట



గోదావరిఖని : సింగరేణి సంస్థ తొలిసారిగా గనిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు చేసింది. మూసివేసిన గనిని సందర్శకుల సందడితో నింపే ప్రయత్నం చేస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణి ఇప్పటి వరకు ఏ ఒక్క గనిని కూడా పర్యాటక కేంద్రంగా తయారు చేయలేదు. విదేశాలతో పాటు కోల్ ఇండియాలోని పలు సంస్థలు మూసివేసిన గనులను కొన్నింటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేశారు. బొగ్గుగనులు అంటే ఏ విధంగా ఉంటాయన్నది సందర్శకులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. తాజాగా సింగరేణి తొలిసారిగా రామగుండం ప్రాంతంలో మూసివేసిన 7-ఎల్ఈపీ గనిని పర్యాటక గనిగా మార్చేందుకు ప్రయత్నిస్తోంది. దానికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం 7-ఎల్ఈపీ గనిని సందర్శించారు. ఇది పట్టణానికి సమీపంలో ఉండటంతో సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందని భావించిన సంస్థ దీనిని ఎంచుకుంది.

ముప్పు నుంచి భద్రత

ఈ గనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వల్ల సమీప కాలనీలతో పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌కు దీని నుంచి ముప్పు తప్పనుంది. సింగరేణి సంస్థ దీనిని లైఫ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. జడీకే-7, 7-ఎ, 7-బి గనులు మూసివేయడంతో వాటి స్థానంలో 7-ఎల్ఈపీ కింద ఈ గనిని 1991లో ప్రారంభించారు. 1993 నుంచి బొగ్గు ఉత్పత్తి మొదలు పెట్టారు. మొత్తం 53 లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్న గనిలో మూసివేత నాటికి 48 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశారు. ఇందులో ఐదు లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. ఈ గనిని గత ఏడాది నవంబరులో మూసివేశారు. ఇందులో పనిచేసిన కార్మికులను ఇతర చోట్లకు బదిలీ చేశారు. గని మూసివేస్తే దానికి సంబంధించిన రక్షణ చర్యలు సైతం తీసుకోవాల్సి ఉంటుంది. బొగ్గు ఉత్పత్తి చేయడం ద్వారా లోపల ఖాళీ ఏర్పడుతుంది. అందులో ఇసుక లేదంటే బూడిద నింపాల్సి ఉంటుంది. కాగా గనిని మూసివేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దీని పైభాగంలో ఉన్న కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. గని పైభాగంలో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంతో పాటు విఠల్‌నగర్, 7-బికాలనీ, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, చంద్రశేఖర్‌నగర్ కాలనీలున్నాయి. ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు సింగరేణి యాజమాన్యం ప్రయత్నం చేస్తుండటంతో భద్రతా చర్యలు సైతం తీసుకుంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల బృందం సందర్శన

సింగరేణి అధికారుల బృందం గురువారం 7-ఎల్ఈపీ గనిని సందర్శించారు. ఎస్టేట్ జీఎం సుభానీ కన్వీనర్ నేతృత్వంలో రక్షణ జీఎం గురవయ్య, ఆర్అండ్‌డీ జీఎం నాగభూషన్‌రెడ్డి, సివిల్ జీఎం రమేశ్‌బాబుతో పాటు మరికొంత మంది అధికారులు గనిని సందర్శించారు. గనిలోపల ఉన్న పరిస్థితులను అధ్యయనం చేశారు. దానికి సంబంధించిన నివేదికను తయారు చేసి సీఎండీకి అందించనున్నారు. ఒకటి రెండు సార్లు దీనిపై సమీక్షలు నిర్వహించిన అనంతరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకోనున్నారు.

రూ.100 కోట్ల ప్రాజెక్టు

గనిని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు రూ.100 కోట్లకు పైనే వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పర్యాటకులు సందర్శనకు వచ్చే సమయంలో వారికి పూర్తి భద్రత ఉండాలంటే గనిలో రక్షణ చర్యలు పటిష్ఠంగా చేపట్టాలి. 48 లక్షల టన్నుల బొగ్గును వెలికి తీసిన సింగరేణి మొత్తం 182 గ్యాలరీలను ఏర్పాటు చేసింది. గని మూసివేస్తే దానికి పైన ఉన్న భూమి కుంగకుండా చర్యలు చేపట్టేందుకు రూ.35 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు దానికి రెట్టింపు నిధులు వెచ్చించాల్సి ఉంటుంది. కోలిండియా పరిధిలోని మహారాష్ట్రలోని వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్, జార?ండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్, మధ్యప్రదేశ్‌లోని సెంట్రల్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ సంస్థలు మూసివేసిన ఒక్కో గనిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేశాయి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి కూడా సింగరేణిపై ఒత్తిడి పెంచింది. తప్పనిసరిగా మూసివేసిన గనిని పర్యాటక కేంద్రంగా రూపొందించాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే 7-ఎల్ఈపీ గనిని సింగరేణి యాజమాన్యం ఎంచుకుంది.

# నీటి లెక్క తేలింది..!

నిర్మల్ : నిర్మల్ జిల్లా.. నీటి వనరుల ఖిల్లా.. ప్రాజెక్టులు, నదులు, వాగులు, చెరువుల్లో నీరు నిలవడంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. జిల్లాలోని 42 ప్యూజోమీటర్ల పరిధిలోని 16 బేసిన్లలో భూగర్భ జలాల సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. రెండేళ్లకోసారి చేపట్టే నీటి లభ్యత.. వినియోగం.. మిగులు జలాలు.. తదితర వివరాల లెక్క తేలింది.

15 మండలాలు సురక్షితం

జిల్లాలోని ముథోల్, భైంసా, లోకేశ్వరం, నిర్మల్ గ్రామీణ మండలాలు మినహాయిస్తే మిగతా 15 మండలాల్లో భూగర్భజలాలు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 70 శాతం కంటే తక్కువగా నీటిని వినియోగిస్తే సురక్షితం, 70 నుంచి 90 శాతం వరకు పాక్షిక ప్రమాదకరం, 90 నుంచి 100 శాతానికిపైగా వినియోగమైతే అధిక వాడకం ఉన్నట్లు లెక్క. అధిక భూగర్భ జలాలు వినియోగించిన ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయడం, ఇసుక తీయడం నిషేధిస్తారు. జిల్లాలో అతి ఎక్కువ నీటి వినియోగం లేదు. కొంత ఎక్కువగా భూగర్భజలాలు వాడుతున్న నాలుగు మండలాల్లో రానున్న రోజుల్లో



నీటి పొదుపు చర్యలు పాటించడంతో పాటు వృథా నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నీరుందని వృథా చేయొద్దు– శ్రీనివాసబాబు, ఉప సంచాలకుడు, భూగర్భజలశాఖ

జిల్లాలో నీటి వనరులు ఎక్కువగా ఉండటంతో భూగర్భ మిగులు జలాలు ఎక్కువే. నీరుందని ఎక్కువగా వినియోగిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. వంద అడుగుల కంటే ఎక్కువలోతులో బోర్లు తవ్వించొద్దు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగంతో నేలల్లో సూక్ష్మ పోషకాల సమతుల్యం దెబ్బతింటుంది. జిల్లాలోని కడెం, దస్తురాబాద్ ప్రాంతాల్లో ఎరువుల వాడకం ఎక్కువగా ఉండటంతో ఆమ్ల, క్షారాల మృత్తికల పెరుగుదలతో నీటి నాణ్యత ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఇక్కడ వాటి వినియోగం తగ్గిస్తే భవిష్యత్తుల ఇబ్బందులు ఉండవు. లేనట్లయితే ఆ నీటిని సేవిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

# ఇస్రో పిలుస్తోంది..

ఖమ్మం : విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అవకాశం కల్పిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. యువికా (యువ విజ్ఞాని కార్యక్రమం) పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శిక్షణకు హాజరయ్యేందుకు రవాణా ఛార్జీలు, బస, భోజన వసతితోపాటు అన్ని సౌకర్యాలను ఇస్రో కల్పించనుంది.

శిక్షణ కేంద్రాలు..ఎంపికైన విద్యార్థుల కోసం ఐదు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు.

1) విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, తిరువనంతపురం
2) యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, బెంగళూరు
3) స్పేస్ అప్లికేషన్ సెంటర్, అహ్మదాబాద్
4) నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్
5) నార్త్-ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్.

మే 16 నుంచి 28 వరకు..

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు వేసవి సెలవుల్లో మే 16నుంచి 28 వరకు 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ తర్వాత శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలను ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పిస్తారు.

దరఖాస్తు విధానం..విద్యార్థులు నాలుగు దశల్లో దరఖాస్తు ప్రక్రియను




పూర్తి చేయాలి.

మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. బీ రిజిస్ట్రేషన్ చేసుకున్న 48 గంటల వ్యవధిలో ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. బీ క్విజ్ పూర్తి చేసిన 60నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. బీ దరఖాస్తుతోపాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతి, విద్యార్థి గత మూడేళ్లలో వివిధ అంశాలలో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలి. బీ దరఖాస్తులు సమర్పించేందుకు ఈ నెల 10నుంచి ఏప్రిల్ 10వరకు అవకాశం కల్పించారు. ఎంపిక జాబితాలను ఏప్రిల్ 20న ప్రకటించి అర్హత సాధించిన వారికి సమాచారం అందిస్తారు.

ఎంపిక ఇలా..ప్రస్తుతం తొమ్మిదో (2021-22) తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. గ్రామీణ ప్రాంతాల వారికి తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఎనిమిదో తరగతిలో పొందిన మార్కులు, మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ప్రతిభ పరీక్ష, ఒలంపియాడ్‌లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటినవారు, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉండటం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చూపినవారికీ ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.

"యువికా శిక్షణకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సైన్స్ ఉపాధ్యాయలకు సూచించాం. విద్యార్థి దశనుంచే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు యువికా తోడ్పాటు అందిస్తుంది."
– చలపతిరాజు, భద్రాద్రి జిల్లా సైన్స్ అధికారి

అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ అర్హులైన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యేటట్లు తగిన చర్యలు తీసుకోవాలి. ఇతర వివరాలకు బి.సైదులు, జిల్లా సైన్స్ అధికారి, చరవాణి నెం.83097 48832ను సంప్రదించాలి. – డీఈవో యాదయ్య, ఖమ్మం

# ప్రగతి స్ఫూర్తి.. పల్లెల కీర్తి

కరీంనగర్ : పల్లె ప్రగతిలో ఈ పంచాయతీలు అత్యుత్తమంగా నిలుస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజావసరాలే పెన్నిధిగా భిన్న ఆలోచనలతో ముందుకు సాగుతున్నాయి. పాలనలో ప్రత్యేకత తెలియజేస్తూ.. చైతన్య స్ఫూర్తిని చాటుతున్నాయి. ప్రథమ పౌరులు తమ గ్రామ ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో నిలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత 9 అంశాల్లో ప్రమాణాలపరంగా భేష్‌గా నిలిచి.. జాతీయ స్థాయి పోటీలకు సై అనేలా ముందుకు సాగుతున్న పల్లెల విజయగాథలపై కథనం. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వెలిచాల గ్రామం వరుసగా అవార్డులను అందుకునే విషయంలో ముందువరుసలో నిలుస్తోంది. ఇక్కడి పంచాయతీ పరిశీలనకు వచ్చిన బృందాలు అచ్చెరువొందేలా ఈ ఊరు రూపురేఖలు మార్చుకుంది. సర్పంచి వీర్ల సరోజన ప్రత్యేక దృష్టి సారించడతో అన్ని రంగాల్లో గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నీటి సౌలభ్యత సమృద్ధిగా ఉన్న విభాగంలో ఈ పల్లె రాష్ట్ర స్థాయిలో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. గతంలో రెండు సార్లు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారాన్ని అందుకొని జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చూపింది. ఈ గ్రామం అనతికాలంలోనే ఉత్తమ పంచాయతీగా మారిపోయింది.

పచ్చదనంతో పర్లపల్లి

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటికే పలుమార్లు అభివృద్ధి విషయంలో గుర్తింపు లభించింది. 2019లో స్వచ్ఛభారత్ ర్యాంకులో



జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును దక్కించుకుంది. 2021లోనూ స్వచ్ఛత విషయంలో నిర్ణీత ప్రమాణాల పెంపు విషయంలో ఆదర్శంగా నిలిచింది. ఏకగ్రీవ గ్రామపంచాయతీగా గుర్తింపు అందుకున్న ఈ ఊరిలో సర్పంచి మాదాడి భారతి ప్రజల భాగస్వామ్యంతో ఊహించని అభివృద్ధి కనిపిస్తోంది. కేంద్రప్రభుత్వ సశక్తీకరణ్ పురస్కారాన్ని 2021లో జాతీయ స్థాయిలో అందుకుంది. తాజాగా పచ్చదనం- పరిశుభ్రతలో రెండో స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా పేరొందింది.

స్వయం సమృద్ధిలో తిమ్మాపూర్

తిమ్మాపూర్ గ్రామపంచాయతీ స్వయం సమృద్ధి విభాగంలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకుంటోంది. సర్పంచి దుండ్ర నీలమ్మ గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది. సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ప్రజలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను చేరువ చేస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ పాలకవర్గం స్వయం సమృద్ధికి బాటలు వేస్తోంది. గతంలో మండల, జిల్లా స్థాయిలో ఈ గ్రామం ప్రత్యేక గుర్తింపును పలు విభాగాల్లో అందుకుంది. సేంద్రియ ఎరువుల తయారీతో పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. మహిళలకు ఆర్థికంగా ఉపాధిని అందించే విషయంలో ఈ ఊరు ప్రగతి దిశగా పయనిస్తోంది.

మహిళా సాధికారితతోనే స్నేహపూర్వక అవార్డు

మండలంలోని మోహినికుంట గ్రామంలో పాలకవర్గమంతా మహిళలే. ఊరి మహిళలతో మమేకమవుతూ వారి సాధకబాధకాలను తెలుసుకుని సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్నారు. ఇందుకు రాష్ట్రస్థాయిలో మహిళా స్నేహపూర్వక అవార్డును సొంతం చేసుకున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా నర్సరీ, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటిక, కంపోస్టు షెడ్డు నిర్మించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. రూ. 40 లక్షల వ్యయంతో గోదాం, పెట్రోల్ బంక్, గొర్రెలు, బర్రెల షెడ్లు, చెక్‌వాల్స్ నిర్మించారు. దాదాపు రూ. 2 కోట్లతో పాఠశాల భవనం నిర్మించగా రూ. 2.4 కోట్లతో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే పలుమార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నామని సర్పంచి వనజ తెలిపారు.

నాలుగు విభాగాల్లో సుల్తాన్‌పూర్

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించడం.. తడి, పొడి చెత్త బుట్టల వాడకం పెంచడం.. కుండీల ఏర్పాటు.. పచ్చదనం పెంచేలా మొక్కలు నాటి సంరక్షించడంతో ఆ గ్రామానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు దక్కింది. 'పచ్చదనం-పరిశుభ్రత, ఆరోగ్యకరం, జీవన ప్రమాణాలు, మహిళా సాధికారత' అనే నాలుగు విభాగాల్లో ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీ జిల్లా స్థాయిలో అగ్రగామిగా నిలవడంతో పాటు పచ్చదనం-పరిశుభ్రత విభాగంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు సాధించింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని సర్పంచి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రత్యేక నిధులు కేటాయిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

వసతుల కల్పనలో మేటి.. గంభీరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మేజర్ పంచాయతీ స్వయం సమృద్ధి- వసతుల కల్పనలో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కేజీ టు పీజీ విద్యాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నారు. గ్రామంలో దాదాపు 90 శాతం సీసీ రోడ్లు వేశారు. మురుగు కాలువలను నిర్మించారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకొన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించారు. ఆధునిక పద్ధతిలో సామాజిక మూత్రశాలలను కట్టారు. మంత్రి కేటీఆర్ చొరవతో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించామని సర్పంచి శ్రీధర్ పంతులు తెలిపారు. అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా



తంగళ్లపల్లి : ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు అక్రమార్కులు అదను చూసి ఇష్టారాజ్యంగా తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. స్థానిక అవసరాల పేరుతో కొందరు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తుండగా, మరికొందరు రాత్రి వేళ అడ్డూ అదుపూ లేకుండా మానేరు వాగు నుంచి తోడేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని ఇసుక స్మగ్లర్లు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళల్లో సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తరలిస్తూ దందాను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు మండెపల్లి, రాళ్లపేట, కస్బెకట్కూర్, గండిలచ్చపేట గ్రామాల శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. మరి కొందరు ఇళ్ల వద్దనే డంపు చేసి అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా వాహనాల్లో తరలిస్తున్నారు.

గ్రామాల్లో లాభసాటి వ్యాపారంగా..

ఇసుక లాభసాటి వ్యాపారంగా మారడంతో అక్రమార్కులు మానేరువాగు నుంచి తరలిస్తూ గ్రామ శివారుల్లో ఓ చోట డంపు చేస్తున్నారు. సుమారు 15- 20 కిలో మీటర్ల దూరం ఇసుక తరలింపునకు కూలీలు, డీజిల్‌కు ఒక్కో ట్రిప్పునకు రూ. 400 నుంచి రూ. 700ల వరకు ఖర్చు అవుతుంది. టిప్పర్ యజమానులు ఒక్కో టిప్పు ఇసుకను రూ. 1500ల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు పోనూ ట్రిప్పునకు రూ. 700ల వరకు లాభం రావడంతో గ్రామాల్లో ఎక్కువగా దీనిని వ్యాపారంగా మార్చుకుంటున్నారు. టిప్పరు యజమానులు అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

వేబిల్లులు తీసుకొని..

స్థానిక అవసరాల పేరిట వేబిల్లులు తీసుకొని సూచించిన స్థానంలో ఇసుకను పోయకుండా జిల్లా సరిహద్దు గ్రామాలైన జిల్లెల్ల, రామచంద్రాపూర్, మల్లాపూర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. అక్కడి నుంచి సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ వంటి పట్టణాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు వారంలో రెండు సార్లు అంటే బుధ, శనివారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు యథేచ్ఛగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తూ జిల్లా సరిహద్దు గ్రామాల శివారుల్లో నిల్వ చేస్తున్నారు.

అతి వేగం.. మైనర్లతో డ్రైవింగ్

స్థానిక అవసరాల పేరిట అనుమతి తీసుకొని మానేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు అతి వేగంగా ప్రధాన రోడ్డుపై వెళ్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. యువకులు కొందరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పోయిన సంఘటనలు ఉన్నాయి. మరికొందరు మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఇసుకకు అనుమతులు ఇచ్చిన రోజు రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టినట్లయితే కొంత మేరకు ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం- సదానందం, తహసీల్దార్, తంగళ్లపల్లి

స్థానిక అవసరాలకు మాత్రమే అనుమతులు ఇస్తున్నాం. అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించినట్లు మా దృష్టికి రాలేదు. రాత్రి వేళల్లో రవాణా చేయకుండా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తరలించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# గోదావరి జలం.. పంటలకు ప్రాణం



గంగాధర : యాసంగి సీజన్‌లో అదను దాటినప్పటికీ ఎల్లంపల్లి ప్రాజెక్టు (గోదావరి) జలాలు విడుదల చేయడంతో పంటలకు ప్రాణధారగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలోని రైతాంగానికి ఎల్లంపల్లి ప్రాజెక్టు వెన్నుదన్నుగా ఉంటుండగా రైతులు రెండు పంటలు పండించుకుని కరవు జయిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం నుంచి రెండు పైపులైన్ల ద్వారా నారాయణపూర్ జలాశయాన్ని నింపుతారు. ఇక్కడి నుంచి చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో దాదాపు 1.60 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని దాదాపు 60 చెరువులు, కుంటలు నింపి ప్రధాన, ఉపకాలువల ద్వారా నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. అయితే గతేడాది భారీ వర్షాలకు వరదలతో గంగాధర, నారాయణపూర్ చెరువుల కట్టలు తెగి నీరంతా వృథాగా పోయింది. యాసంగిలో ఎల్లంపల్లి నీటి విడుదలపై సందిగ్ధం నెలకొనగా రైతులు సగం విస్తీర్ణంలో అంటే దాదాపు 80 వేల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేశారు. అయినప్పటికీ వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోయాయి. 'ఈనాడు' కథనాలతో ప్రభుత్వం నారాయణపూర్ చెరువు కట్ట మరమ్మతులు పూర్తి చేసి మార్చి 10 నుంచి ఎల్లంపల్లి నీరు విడుదల చేసింది.

ఎగువ ప్రాంతాలకు ఎత్తిపోతలు షురూ..నారాయణపూర్ నుంచి ఎడమకాలువ ద్వారా గంగాధర మండలంలోని ఆయా గ్రామాలకు నీరు పంటలకు అందుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రామడుగు మండలంలోని ఆయా గ్రామాలకు మత్తడి దూకుతూ లక్ష్మీదేవిపల్లి-నాగిరెడ్డిపూర్ వాగు ద్వారా పుష్కలంగా నీరు చేరుతోంది. ఇక నారాయణపూర్ నుంచి నాలుగు రోజులుగా కొడిమ్యాల మండలం పోతారం చెరువు నింపి ఇక్కడి నుంచి వాల్వులు విప్పి నాచుపల్లి నాగసముద్రం చెరువు నింపారు. నల్లగొండ, తిప్పాయిపల్లి, బోయినపల్లి మండలంలోని అనంతపెల్లి, కోరెం, వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, శాత్రాజ్‌పల్లి, నూకలమర్రి, చందుర్తి మండలం నర్సింగాపూర్, బండపల్లి గ్రామాలకు నీటిని విడుదల చేసి పంటలకు అందించారు. ఎగువ గ్రామాల్లోని దాదాపు 40 వేల ఎకరాలకు సాగునీరు అందగా ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా నారాయణపూర్ చెరువు మత్తడి పదేపదే తెంపడంతో ఎగువ గ్రామాలకు నీటి విడుదలలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. నీటి విడుదలతో సరాసరిగా పంటలకు నీరు అందగా వ్యవసాయ బావుల్లో జలం పైకివచ్చింది. విద్యుత్తు వినియోగంతోపాటు నీటి వినియోగం తగ్గి రైతులకు శ్రమ తప్పినట్లయింది.

నాలుగు ఎకరాలు దక్కాయి

రెండు బావుల ఆధారంగా 8 ఎకరాల్లో వరి పంట వేస్తే బావుల్లో ఊటలు తగ్గి పొలం పారడం కష్టమైంది. ఇప్పటికే ఎకరన్నరలో పంటలు వేయక బీడుగా వదిలేసిన. ఎట్టకేలకు నీటి విడుదల చేయడంతో పోతున్న ప్రాణం తిరిగొచ్చినట్లయింది. లేకపోతే సగం విస్తీర్ణంలో పంటలు ఎండిపోయి పెట్టుబడులు మీద పడే ప్రమాదముంది. 15 రోజులు ముందుగా నీటిని ఇస్తే మిగతా రైతులు నష్టపోయేవారు కాదు.

కొట్టె రాజయ్య, లక్ష్మీదేవిపల్లినీరు వచ్చినా.. రాళ్ల వాన ముంచింది

ఎల్లంపల్లి నీరు విడుదలతో పంటలు పండాయనే సంతోషం కూడా వడగళ్ల వాన మిగలకుండా చేసింది. మూడు రోజులపాటు కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, కూరగాయలు దెబ్బతిని కోలుకోలేకపోతున్నాం. 50 శాతం నష్టం జరిగితేనే పరిహారం ఇస్తామని అధికారులు కొర్రీలు పెడుతున్నారు.

మొగిలిపాలెం అంజయ్య, నాగిరెడ్డిపూర్

# అప్రమత్తతే శ్రీరామ రక్ష

గోదావరిఖని : దేశవ్యాప్తంగా 'కరోనా' కేసుల సంఖ్య పెరుగుతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వారం రోజులుగా కరోనా కేసులు నమోదవుతున్నాయి. దీంతో స్థానికుల్లో భయాందోళన వ్యక్తమవుతుండగా గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో 'కొవిడ్ ఐసోలేషన్ వార్డు' ఏర్పాటునకు చర్యలు తీసుకుంటున్నారు. కొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో ఆక్సీజన్ సదుపాయం కలిగిన కొవిడ్ ఐసోలేషన్ వార్డు సిద్ధం కానుంది. రెండు పర్యాయాలు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కరోనా కేసులు అత్యధికంగానే నమోదు కావడంతో ఆసుపత్రిలోని కొవిడ్ ఐసోలేషన్ వార్డులో అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు అందించారు. మరోసారి రామగుండం ప్రాంతంలో కరోనా వ్యాప్తి వెలుగు చూస్తుండడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

వారం రోజుల్లో ముగ్గురికి.. వారం రోజుల్లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మూడు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. స్థానిక పరిశ్రమల్లో పని చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు తరచూ ఆయా ప్రాంతాలకు వెళ్లి వస్తుండడంతోనే గతంలో ఈ ప్రాంతంలో కరోనా వ్యాప్తి పెరిగింది. ఒక దశలో కళాశాలల నుంచి వచ్చే విద్యార్థుల్లోనూ కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా స్థానికుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి జ్వరం, జలుబుతో బాధపడుతూ ఓ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేసుకోగా కొవిడ్ పాజిటివ్‌గా తేలింది. వైద్యులు అవసరమైన మందులు ఇచ్చి పంపించారు. రెండు, మూడు రోజుల క్రితం గోదావరిఖనిలోని రెండు వేర్వేరు కాలనీలకు చెందిన ఇద్దరికి కరోనా సోకినట్లుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రితో పాటు ఈ ప్రాంతంలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ రోజు దాదాపు 25కు పైగా కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. మాస్కులు వాడితే మేలుకరోనా వ్యాప్తి మొదలైన నేపథ్యంలో ప్రతీఒక్కరు కొవిడ్ నిబంధనలను పాటిస్తే ప్రయోజనముంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించడం, జనం గుమికూడిన స్థలాల్లోకి వెళ్లకపోవడం, తరచూ చేతులను శానిటైజ్ చేసుకోవడం తదితర నిబంధనలను తప్పకుండా పాటించాల్సి ఉంది. కానీ.. గోదావరిఖని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే వారితో పాటు గర్భిణుల రద్దీ ఎక్కువ ఉండడం కలిగిస్తోంది.

# ఎందుకో.. ఏమో.. రసం తగ్గుతోంది

నల్గొండ : నల్గొండ జిల్లా అనగానే ఒకప్పుడు నిమ్మ, బత్తాయి తోటలు గుర్తుకు వచ్చేవి. ఇదంతా గతం. ఒకప్పుడు రెండు లక్షలకు పైగా ఎకరాల విస్తీర్ణంలో ఉండి ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా బత్తాయి పంట పండించే జిల్లాగా ఒక వెలుగు వెలిగిన నల్గొండలో.. ఏటేటా ఆ పంట సాగు గణనీయంగా తగ్గుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం 42 వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తుండగా..క్షేత్రస్థాయిలో అది 30 వేల ఎకరాలకు పడిపోయింది. రాష్ట్రంలోనే తొలిసారిగా బత్తాయి మార్కెట్‌ను నల్గొండలో ఏర్పాటు చేసినా.. అందులో కార్యకలాపాలు జరగడం లేదు. మరోవైపు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు, నీటి వసతి పెరగడం తదితర కారణాలతో రైతులు సైతం బత్తాయి పంటను సాగు చేయడానికి ముందుకు రావడం లేదు.

నల్గొండ, కనగల్, చండూరు, గుర్రంపోడు, హాలియా, పెద్దవూర, పీఏ పల్లి, మల్లేపల్లి, నాంపల్లి, మునుగోడు ప్రాంతాల్లో ఒకప్పుడు రైతులంతా బత్తాయినే పండించేవాళ్లు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) కాల్వ వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లోని భూములకు



నీటి వసతి పెరగడం, ఆ తడితో వేరుపురుగు తెగుళ్లు సోకడంతో క్రమంగా బత్తాయి పంట సాగు కనుమరుగవుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న ఐదారేళ్లలో ఉమ్మడి జిల్లాలో సాగు 5 వేల ఎకరాలకు పడిపోవడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా బత్తాయి మొక్కలను నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి దిగుబడులు మొదలవుతాయి. 20 ఏళ్ల వరకు కాపు వస్తుండగా..రైతులు మాత్రం ఏడెనిమిదేళ్లలోనే దిగుబడులు తీసి అనంతరం చెట్లను నరికివేస్తున్నారు.

అదే దారిలో నిమ్మ

ఉమ్మడి రాష్ట్రంలోనే నిమ్మ పంటకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న నల్గొండ జిల్లాలో ఆ పంట విస్తీర్ణమూ క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్ల క్రితం 45 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నిమ్మ, ప్రస్తుతం 12 వేలకు పడిపోయింది. బహిరంగ మార్కెట్లో ధరలున్నా రైతుకు గిట్టుబాటు ధర తగ్గకపోవడం, అంతుచిక్కని తెగుళ్లు వచ్చి చెట్లు ఎండిపోవడం, గత ఐదారేళ్లుగా నీటి వసతి పెరిగి, వరి పంట సాగుకే రైతులు మొగ్గు చూపుతుండటంతో నిమ్మ సాగు తగ్గుతోంది. ప్రస్తుత పరిణామాలను బట్టి గత చరిత్ర కనుమరుగయ్యే ప్రమాదం నెలకొందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బత్తాయి, నిమ్మ సాగు వైపు రైతులు వెళ్లేలా ప్రోత్సహించడంలో అధికారులు విఫలమవుతున్నారన్న వాదనలున్నాయి. ఇటీవలే ప్రభుత్వం సైతం నల్గొండ జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు పెరుగుదలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసినప్పుడే బత్తాయి పంటను కాపాడుకోగలమని రైతులు వెల్లడిస్తున్నారు.

గిట్టుబాటు లేకే

ఒకప్పుడు నిమ్మలో అద్భుతాలు చేసిన వాళ్లమే. అయితే ఇప్పుడా పరిస్థితి లేదు. తెగుళ్లు, ఇతరత్రా కారణాలతో నిమ్మ నుంచి వచ్చే రాబడి కూలీలకు, ఇతరత్రా ఖర్చులకే వెళ్తోంది. ఏమీ గిట్టుబాటు కావడం లేదు. గతంలో ఉన్న దాని కంటే నీటి వసతి సైతంపెరిగింది. దీంతో సహజంగానే వరిసాగుకు మొగ్గుచూపుతున్నాం. దీంతో నిమ్మ తోటల సాగును తగ్గించాం.

యానాల క్రిష్ణారెడ్డి, నెల్లిబండ, నకిరేకల్ మండలం

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాను బత్తాయి క్లస్టర్‌గా ప్రకటించి ఈ పంట సాగు మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. వివిధ కారణాలతో రైతులు బత్తాయి సాగును తగ్గిస్తున్నది వాస్తవమే. ఏ తెగుళ్లు వచ్చినా తట్టుకునే సామర్థ్యమున్న నాణ్యమైన మొక్కలను రైతులకు సరఫరా చేసి తిరిగి వారు బత్తాయి సాగు వైపు మళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. సంగీత లక్ష్మి, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యాన శాఖ, నల్గొండ

# వెల్లంకిపై మమకారం.. దాతల సహకారం

రామన్నపేట :: రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం దక్కింది. కేంద్రం నిర్దేశించిన 9 అంశాల్లో ఒకటైన స్వయం సమృద్ధి విభాగంలో రెండో స్థానం సాధించింది. గ్రామ సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో పాటు సొంత నిధులు వినియోగించి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈయన స్ఫూర్తితో కొంతమంది దాతలు ముందుకు రావడం తదితర కారణాలతో వెల్లంకి గ్రామానికి రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కింది. 2021-22 సంవత్సరానికి గాను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచి ఎడ్ల మహేందర్‌రెడ్డి అందుకున్నారు. రూ. 80 లక్షల వ్యయంతో అధునాతన సదుపాయాలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. రూ. 3 లక్షలతో నీటి శుద్ధి కేంద్రానికి గది, వైకుంఠధామంలో రూ. 12.50 లక్షల వ్యయంతో గది, రూ. 3లక్షలు వ్యయంతో వాణిజ్య సముదాయం వంటి పలు పనులు సొంత నిధులతో చేపట్టారు. రైతు వేదికకు అదనంగా సొంత నిధులు ఖర్చు చేసి హైటెక్ భవనంలా దిద్దారు. హెచ్‌పీసీఎల్ సంస్థ సహకారంతో రూ. 20లక్షలు వ్యయంతో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. గ్రామంలో హరితహారం కింద నాటిన మొక్కలతో గ్రామంలోని పలు వీధులు పచ్చదనంతో కన్పిస్తాయి. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ కె.నర్సింహులు ఫిబ్రవరి 24న వెల్లంకిని సందర్శించి పరిశీలించారు. రాష్ట్ర స్థాయిలో పురస్కారాన్ని అందుకోవటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బొగ్గు ఉత్పత్తితో గనికీర్తి

ఖమ్మం : వార్షిక సంవత్సరంలో నిర్దేశించిన 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి సత్తుపల్లి జేవీఆర్ ఓసీ-2 చరిత్ర సృష్టించింది. 130 ఏళ్ల సింగరేణి ప్రస్థానంలోనే ఇది రికార్డు అని అధికారులు చెపుతున్నారు. భారతదేశంలోనే ఉత్పత్తి సాధనలో జేవీఆర్ ఓసీ నాలుగో స్థానంలో నిలవడం విశేషం. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని మార్చి 31 నాటికి పూర్తి చేయడంతో సింగరేణి ఉన్నతాధికారులు, జేవీఆర్ ఓసీ అధికారులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది యావత్ సింగరేణికే మణిహారంగా నిలిచింది. మార్చి 30 నాటికి 99.66లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా 31న ఒక్క రోజే మిగిలిన మొత్తం ఉత్పత్తి సాధించింది.

ఫలించిన యంత్రాంగం కృషి



2022-23 వార్షిక సంవత్సరంలో సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం కోసం అధికార యంత్రాంగం చేసిన కృషి ఫలించింది. సీఎండీ ఆదేశాల మేరకు డైరెక్టర్లు, జీఎం జక్కం రమేశ్ సలహాలు, సూచనలు, పీవో వెంకటాచారి నిరంతర పర్యవేక్షణ, అధికారులు, కార్మికులతో సమీక్షా సమావేశాలు నిర్వహణ, యంత్రాల సమగ్ర వినియోగంతో లక్ష్యం ఛేదన సాధ్యమైంది. కొత్తగూడెం ఏరియాలో 2022-23 ఏడాదికి గాను 140 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టగా 128 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఇందులో ప్రథమంగా జేవీఆర్ ఓసీ-2 గనికి 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని కేటాయించగా అధిగమించి రికార్డును నెలకొల్పింది.గనిలోని ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితోనే ఉత్పత్తి సాధ్యమైంది. సింగరేణి డైరెక్టర్లు, జీఎం ప్రశంసలు మరింత ప్రోత్సాహానిచ్చాయి. వెంకటాచారి, జేవీఆర్ ఓసీ, పీవో, సత్తుపల్లి

# పాఠశాలల సమస్త సమాచారం.. ట్యాబ్‌లో నిక్షిప్తం

భూపాలపల్లి: రోజురోజుకు సాంకేతికత పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రభుత్వం 'ట్యాబ్'లను పంపిణీ చేస్తూ, అందులోనే పూర్తి వివరాలను నమోదు చేసేలా చర్యలు చేపడుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగానే 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఈ మేరకు పాఠశాలల ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులు పంపిణీ చేయనుంది. ఇప్పటికే వస్త్రం పంపిణీ చేయడంతో జిల్లా విద్యా శాఖ అధికారులు స్కూల్ డ్రెస్‌లు కుట్టడానికి మహిళా సంఘాలకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమగ్ర స్వరూపాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు గతంలోనే 'యూ డైస్ ప్లస్' వంటి కార్యక్రమా లను చేపట్టింది. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు తమ చరవాణుల్లో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేవారు. ఈ విధానంతో కొంతమేరకు ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రత్యేకంగా ట్యాబ్‌లు పంపిణీ చేయాలని గతంలో పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాయి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ట్యాబ్‌లు సరఫరా చేసింది.

జిల్లాకు 294 ట్యాబ్‌లు..భూపాలపల్లి జిల్లాలోని 11 మండలాల్లో మొత్తం 319 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 44 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. రెండు రోజుల క్రితం జిల్లాలోని 44 యూపీఎస్‌లకు ట్యాబ్‌లు 44 మంజూరు కాగా 319 పీఎస్‌లకు మొత్తం 250 వరకు ట్యాబ్‌లు వచ్చాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొత్తం జిల్లాకు 294 ట్యాబ్‌లు కేటాయించారు. వీటిని డీఈవో కార్యాలయంలోనే నిల్వ చేశారు. వీటి పంపిణీ కోసం ఇంకా స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. 150 కంటే ఎక్కువ విద్యార్థులున్న



పాఠశాలలకు రెండేసి ట్యాబ్‌లు ఇస్తారు. ట్యాబ్‌ల వినియోగంపై మొదట జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమగ్ర శిక్షణ అధికారులు శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు తర్ఫీదునిచ్చి ట్యాబ్‌లు అందజేయనున్నారు. 'తొలిమెట్టు'లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజన పథకం, బాలబాలికల వివరాలు, మన ఊరు-మన బడి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐఎస్ఎంఎస్ పోర్టల్, చైల్డ్ఇన్ఫో తదితర పూర్తి సమాచారాన్ని ట్యాబ్‌లలో పొందుపర్చనున్నారు.

తగ్గనున్న ఇబ్బందులు..

ఇంత వరకు పాఠశాలల్లో సమాచారాన్ని ఉపాధ్యాయులు వారి చరవాణుల్లో ఆన్‌లైన్ చేసేటప్పుడు చాలా వరకు ఇబ్బందులు ఎదురయ్యేవి.. నేడు ఈ ట్యాబ్‌ల పంపిణీతో ఇబ్బందులు తొలగిపోనున్నాయని పలువురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌ల కారణంగా ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలు, సంక్షేమం గురించి వెంటనే తెలియపర్చడానికి అనుకూలంగా ఉంటుంది. యూ డైస్ ప్లస్‌లో ఎన్ని రకాల సమాచారం ఉంటుందో ట్యాబ్‌ల్లోనూ అంత సమాచారం నమోదుకు చేసుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# రెండుచోట్లా.. రిక్తహస్తమే..!



ఖమ్మం : రాష్ట్రంలో కొత్తగా రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం మార్చి 25న ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు, పెద్దపల్లి జిల్లా రామగుండంలో నూతనంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఈ రెండూ ఏప్రిల్ 1నుంచి మనుగడలోకి రానున్నాయి. పూర్వ ఖమ్మం జిల్లాలో దీర్ఘకాలిక డిమాండ్ ఉన్న రెండు ప్రాంతాల్లో కూడా సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటు విషయంలో మొండిచెయ్యే ఎదురైంది. ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వానికి గతంలో ప్రతిపాదనలు పంపారు. కానీ మంజూరుకు నోచుకోలేదు.

జిల్లాకేంద్రాన్ని దాటి..ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ భూములకు ధరలు కూడా ఎక్కువ. రఘునాథపాలెంలో భూముల క్రయవిక్రయ లావాదేవీల రిజిస్ట్రేషన్ల కోసం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్ఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. పక్కనే ఉన్న కామేపల్లి, సింగరేణి మండలాలను కలిపి రఘునాథపాలెంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్లుగా కోరుతున్నారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు పలుమార్లు సమస్యను విన్నవించారు. కార్యరూపం దాల్చలేదు.

80-90 కిలోమీటర్ల దూరంలో..

భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదు. ఉద్యాన కూడలిగా పేరుగాంచిన అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నాన్ ఏజెన్సీ ప్రాంతాలూ ఉన్నాయి. అశ్వారావుపేట పట్టణం, మందలపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భూములు, ఇళ్ల స్థలాల క్రయవిక్రయ లావాదేవీలు సాగుతుంటాయి. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల ప్రజలకు భూముల రిజిస్ట్రేషన్ల కోసం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం వెళ్లాల్సి ఉంటుంది. అశ్వారావుపేట మండల వాసులు కొత్తగూడెం వెళ్లాలంటే దాదాపు 100 కి.మీ. దూరం ప్రయాణించక తప్పదు.

ఆదాయ నగరం..

ఉభయ జిల్లాల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం రూ.224.03 కోట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి రూ.224.03 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి లభించింది. రెండు జిల్లాల పరిధిలో గతేడాది కంటే ఈ ఏడాది శాఖకు ఆదాయం స్వల్పంగా తగ్గింది. ఖమ్మం ఎస్ఆర్వో కార్యాలయంలో మాత్రం గతేడాది కంటే అధికంగా ఆదాయం లభించింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య మాత్రం తగ్గింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి.

# పాడి రైతులకు భరోసా



ఖమ్మం : పాడి రైతులకు భరోసా ఇచ్చేందుకు పశుగణాభివృద్ధి సంస్థ ప్రయత్నిస్తోంది. పాడిసంపద వృద్ధి కోసం ప్రతి రైతు ఆడదూడ పుట్టాలని కోరుకోవడం, ఒకవేళ మగదూడ పుడితే పోషణ భారంతో విక్రయిస్తున్న సందర్భాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టేలా చేసిన ప్రయోగాలు సఫలం కావడంతో దీన్ని ఉమ్మడి జిల్లాలో మరో వారంలో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గతంలో వ్యవసాయ సాగుకు పశుపోషణ ఊతంలా ఉండేది. నేడు పరిస్థితి మారిపోయింది. కేవలం పాడిసంపద కోసమే పశుపోషణ అన్నట్లు మారిపోయింది. కృత్రిమ గర్భధారణ సమయంలో ఆడదూడలు పుడితే పాడిపరమైన లాభదాయకం ఉంటుందని రైతులు యోచిస్తున్నారు. కానీ ఇప్పటివరకు జరిగిన కృత్రిమ గర్భధారణలో వంద దూడలు పుడితే సగం ఆడ, సగం మగ పుట్టేవి. కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టేలా ప్రత్యేక వీర్యకణాలు తయారు కావడంతో పాటు తెలంగాణ పీవీ నర్సింహారావు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆమోదం పొందటంతో మరో వారంలో ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వైరాలోని పశుగణాభివృద్ధి సంస్థ నుంచి ఈ కార్యక్రమం అమలుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్వహణ ఇలా..

వారం పది రోజుల్లో పట్టాలెక్కనున్న నూతన ప్రక్రియలో రైతులు కోరితే ఆడదూడ పుట్టేలా కృత్రిమ గర్భధారణ చేయనున్నారు. తెల్ల పశువుల్లో జెర్సీ, హెచ్‌ఎఫ్ (నల్లమచ్చలతో ఉండే తెల్లఆవు), మహారాష్ట్రకు చెందిన సాహీవేల్ జాతికి చెందిన వీర్యకణాలు అందుబాటులో ఉన్నాయి. నల్ల జాతి నుంచి ముర్రా మాత్రమే ఉంది. పుణేలోని బేఫు, కశ్మీర్‌లోని రుషికేశ్ నుంచి ఆయా వీర్యకణాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 30చోట్ల వీటిని ప్రయోగించారు. ప్రయోగాత్మక దశలో బోనకల్లులోని రావినూతల, రూరల్‌లోని కామంచికల్లులో రెండు ఆడదూడలు పుట్టగా ఇతర చోట్ల చూడి దశలో ఉన్నట్లు పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు జరిగే సాధారణ కృత్రిమ గర్భధారణకు ఒక్కోటి రైతు నుంచి నామమాత్రంగా రూ.100 వసూలు చేస్తుండగా ఆడదూడ పుట్టేందుకు చేసే గర్భధారణ ధర రూ.300 వరకు ఉండే అవకాశాలున్నాయి.

రైతులకు ఊరట: కె.కిశోర్, పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి

కేవలం ఆడదూడలు మాత్రమే పుట్టించేలా కొత్త వీర్యకణాలు వచ్చాయి. వీటికి ఆమోదం వచ్చింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రయోగించాం. మరో మగదూడలను పోషణ చూడకుండా వదిలేస్తుండటంతో చనిపోతున్నాయి. దీనివల్ల మార్పునకు శ్రీకారం చుడుతున్నాం.

# ఉపాధి పనుల్లో మగువలదే హవా!

జనగామ : నిరుపేదలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఓ వరం. గ్రామీణ ప్రజలు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్నారు. మగవారికి దీటుగా పని చేస్తూ సంపాదనలోనూ పైచేయి సాధిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో చేపట్టిన ఇంకుడుగుంతలు, భూ అభివృద్ధి పనులు, హరితహారం, మట్టి రహదారుల నిర్మాణం, శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్ల నిర్మాణం.. తదితర పనుల్లో భాగస్వాములవుతున్నారు.

రూ.20 కోట్లకు పైగా కూలీ ఆర్జన ఉపాధి హామీ పనులకు మహిళలే అధికంగా హాజరవుతున్నారు. జిల్లాలో 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో మహిళా కూలీలు రూ.20 కోట్లకు పైగా ఆర్జించారు. మొత్తం 95,801 మంది కూలీలు పని చేయగా వారిలో మహిళలు 54,418 మంది, పురుషులు 41,383 మంది ఉన్నారు. పురుషులు రూ.1,297 లక్షల వేతనం ఆర్జించగా, మహిళలు రూ.2,077 లక్షల వేతనం సంపాదించారు. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం లేకపోవడం, పనివేళలు అనువుగా ఉండటం, స్థానికంగానే పనులు కల్పిస్తుండటం, పనులు సులభంగా ఉండడంతో ఉపాధి పనులు చేసేందుకు అతివలు ఆసక్తి చూపుతున్నారని అధికారులు చెబుతున్నారు.

వసతులు కల్పిస్తే ఇంకా పెరిగే అవకాశం

ఉపాధిహామీ పథకం ప్రారంభమైన మొదట్లో కూలీలకు అన్ని వసతులు కల్పించేవారు. క్రమ క్రమంగా వసతుల లేమితో కొంత మేర కూలీలు తగ్గారు. రోజుకు రెండు లేదా మూడు గంటల వ్యవధిలో రూ.150 నుంచి రూ.300 వరకు సంపాదించుకునే ఆస్కారం ఉండడంతో వ్యవసాయ ఆధారిత కూలీలు సైతం ఉపాధిపనుల వైపే మొగ్గు



చూపుతున్నారు. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే కూలీల సంఖ్య తగ్గడం తో.. రైతులు గుత్తా లెక్కన కూలీలను మాట్లాడుకొని పనులు చేయించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో మందికి జీవనాధారమైంది. ప్రైవేటు కంపెనీల్లో సాధారణ జీతంతో పనిచేసిన మహిళలు, నిరుద్యోగులు సైతం కొవిడ్ దెబ్బతో ఉద్యోగాలు పోవడంతో ఉపాధి పనులకు వెళ్తున్నారు.

కోరిన వారికి జాబ్‌కార్డులు ఇస్తున్నాం..

ఉపాధి పనులు చేసేందుకు ముందుకొచ్చే వారికి జాబ్‌కార్డులు ఇస్తున్నాం. పురుషులతో కంటే మహిళలే ఎక్కువగా ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఇంకా ఎవరైనా ఉపాధి పని చేయాలనుకుంటే సంబంధిత క్షేత్ర సహాయకులను సంప్రదించి జాబ్‌కార్డును పొందవచ్చు.డీఆర్డీవో రాంరెడ్డి

# చేతులే యంత్రమా.. వ్యాపారి చెప్పిందే నాణ్యతా?

భూపాలపల్లి : అకాల వర్షాలు చీడపీడల నుంచి మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొద్దోగొప్పో చేతికొచ్చిన పంటను మార్కెట్‌కి తీసుకువెళ్తే గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. యార్డులో రెండు లాట్లకు గరిష్ఠ ధరలు ఇస్తూ.. మిగిలిన లాట్లకు కనిష్ఠ ధరలు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మిర్చి నాణ్యతను ఐదు నిమిషాల్లో తెలిపే మిషన్లను జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కో మార్కెట్‌కు రూ.13లక్షలు వెచ్చించి సెంటర్



ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ సంస్థ రూపొందించిన మిర్చి నాణ్యత యంత్రాన్ని 2022 మార్చిలో ఏర్పాటు చేశారు. ఏడాది పూర్తవుతున్నా ఆ యంత్రాన్ని ఇప్పటి వరకు వినియోగించింది లేదు. నాణ్యత తెలిస్తే తగిన ధరను డిమాండ్ చేసే అవకాశం ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారు

ధరంసోతు నరేశ్, క్యాంపుతండా, కేసముద్రం : నాణ్యత పేరుతో మార్కెట్‌లో తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నారు. వ్యాపారి చేతితో పట్టుకొని తేమ ఉందని చెబుతున్నారు. అత్యవసరంతో ఒకటి రెండు బస్తాలు మార్కెట్ బయట విక్రయిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మార్కెట్‌లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మిర్చి నాణ్యత యంత్రం నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

సాంకేతిక లోపం ఉంది

రాజా, మార్కెట్ కార్యదర్శి, కేసముద్రం : జిల్లాలోని కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ యార్డుల్లో గతేడాది మార్చిలో మిర్చి నాణ్యత యంత్రాలు ఏర్పాటు చేశాం. సాంకేతిక లోపం కారణంగా వినియోగించటం లేదు. ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం..

# వడివడిగా.. ఆయుష్మాన్ భారత్!

భూపాలపల్లి : పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం అందని ద్రాక్షలానే మిగిలిపోతోంది.. ఏదైనా అనారోగ్య సమస్య ఎదురైతే చికిత్స చేయించుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే లక్షల్లో బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం దేశ జనాభాలో 40 శాతం మంది అత్యంత పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. అలాంటి వారంతా అనారోగ్యం పాలైతే ప్రభుత్వ ఆసుపత్రులే దిక్కు.. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని పేదలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం ద్వారా రూ.2 లక్షల వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంటుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం తరహాలోనే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తికి దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఈకేవైసీ ద్వారా నమోదుకు చర్యలు తీసుకుంటున్నారు.

చాలా మందికి అవగాహన లేక..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఈకేవైసీ నమోదు కేవలం 36 శాతమే నమోదు కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 76 మండలాలు ఉండగా దారిద్ర్య రేఖకు దిగువన 4.92 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అందులో 15.29 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరందరి వివరాలను ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తేనే వారికి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మీ సేవ, కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు.




కార్యక్రమ అమలుకు సంబంధించి సరైన ప్రచారం కల్పించకపోవడంతో చాలా మందికి అవగాహన లేక ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు కావడంలో వెనకడుగు పడుతోంది.

దేశంలో ఎక్కడైనా..

రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లభించడంతో అర్హులైన లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించే అవకాశం ఉంటుంది. తాజాగా కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు అవకాశం కల్పించారు. అలాగే దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రూ.5 లక్షలలోపు ఉచితంగా వైద్య చికిత్సలు పొందే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు పూర్తయితే సంబంధిత కార్డు పోస్టు ద్వారా ఇంటికి పంపించనున్నారు. ఈ కార్డు ఏ రాష్ట్రంలోనైనా అమలులో ఉండటంతో ఎక్కడైనా వైద్యం పొందే అవకాశం ఉంటుంది.

నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం..

ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఈకేవైసీ నమోదుకు సంబంధించి గతంలో ఏఎన్ఎం, ఆరోగ్య మిత్రలతో నమోదు చేయించాం. కంటి వెలుగు కార్యక్రమం అమలులో ఉండటంతో నమోదులో కాస్త వెనకబడింది. తాజాగా కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా ఈకేవైసీ నమోదు చేస్తున్నాం. డాక్టర్ కమల్‌చంద్‌నాయక్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ఉమ్మడి వరంగల్ జిల్లా

# పుష్కరకాలానికి మోక్షం

జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యా హ్నం భోజనం వండే కార్మికులకు అందిస్తున్న గౌరవ వేతనం పెంపున కు ఎట్టకేలకు దాదాపు పుష్కర కాలనికి మోక్షం లభించింది. మధ్యాహ్న భోజన వంట కార్మికుల గౌరవ వేతనాన్ని ఇటీవల సీఎం కేసీఆర్ పెం చినట్లు ప్రకటించారు. ఇప్పటివరకు ఇస్తున్న నెలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 గౌరవ వేతనం పెంచడం పట్ల కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పన్నెండేళ్లుగా గౌరవ వేతనం పెంపు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవ వేతనాన్ని పెంచడంతో సంతోషపడుతున్నారు. 2010 సంవ త్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండు తున్న కార్మికులకు గౌరవ వేతనంగా ఒక్కొక్కరికి రూ. వెయ్యిని అంది స్తోంది. సర్కారు అందిస్తున్న గౌరవ వేతనం సరిపోవడం లేదని, వేత నాన్ని పెంచాలని కార్మికులు డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ రా ష్ట్రం ఏర్పడిన అనంతరం 2015 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజె న్సీలను నిర్వహిస్తున్న మహిళలు తమ గౌరవ వేతనాన్ని రూ. 5,000కు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా కార్మికులు తమ డిమాండ్ పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని రావడానికి పలు కార్యక్ర మాలు, ఉద్యమాలు, నిరసనలు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు సీఎం కేసీ ఆర్ ఇటీవల వంట కార్మికుల గౌరవ వేతనం పెంచుతూ ప్రకటన చేయ డం పట్ల సంబంధిత వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో సుమారు రెండు




వేలకు పైగా కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.జిల్లాలో వంట ఏజెన్సీలు, కార్మికుల పరిస్థితి ...జిల్లా మొత్తం 783 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సుమారుగా 55 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సుమారుగా 2 వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నా రు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 300 మంది విద్యార్థుల కంటే త క్కువగా ఉన్న వాటిల్లో ముగ్గురు చొప్పున కుక్ కమ్ హెల్పర్స్‌ను నియ మించే అవకాశం ఉంది. ఆ తదుపరి పెరిగిన ప్రతీ 50 మంది విద్యా ర్థులకు మరో హెల్పర్‌ను నియమించుకోవచ్చు. రూ. వెయ్యి గౌరవ వేత నం సరిపోకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదు ర్కొంటున్నాయి. ఏజెన్సీల నిర్వాహకులు, కార్మికులు దశాబ్దాలుగా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. వంట ఏజెన్సీలకు అందిస్తున్న బి ల్లులు సైతం పెరిగిన ధరల వల్ల సరిపోవడం లేదన్న అభిప్రాయాలున్నాయి.ఏజెన్సీలకు పెరగనున్న పోటీ...

ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికుల గౌరవ వేతనాన్ని పెం చడంతో మునుముందు ఏజెన్సీల నిర్వహణకు పోటీ పెరిగే అవకాశాలు న్నాయి. ఇప్పటివరకు ఏడాదికి 10 నెలలకు గాను ప్రతీ నెల రూ. వెయ్యి ప్రభుత్వం గౌరవ వేతనంగా అందించేది. దీంతో వంట ఏజెన్సీలు ని ర్వహించేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోయేవారు. రోజువారీ కూలీ ప నులకు వెళ్లినా ప్రతి రోజు రూ. 300కు తగ్గకుండా నెలకు కనీసం రూ. 9000 వరకు జమ చేసుకునే అవకాశం ఉండేది. పొలాలకు, బయటి పనులకు వెళ్లి ఇతరత్రా పనులు చేయలేని మహిళలు మాత్రమే వంట ఏజెన్సీ పనులు చేస్తూ ఉండేవారు. తాజాగా పెరిగిన రూ. 3,000 గౌరవ వేతనం వల్ల భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశం ఉందన్న అభిప్రా యాలు వినిపిస్తున్నాయి.అంతంతమాత్రంగానే వంట గదులు...జిల్లా వ్యాప్తంగా 783 పాఠశాలలకు గాను సుమారు 200 పాఠశాల ల్లో మాత్రమే వంట గదులున్నాయి. చాలా గ్రామాల్లో వంట గదులు ప్ర తిపాదన దశలోనే ఉ న్నాయి. మిగతా చాలా గ్రామాల్లో గదులు లే వు. ప్రధానంగా చాలా పాఠశాలల్లో తాగునీటి సమస్యలు తాండవిస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతు న్నాయి. బోరు బావులు సరిగా పని చేయడం లేదు. నీటి కోసం చాలా దూరం వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని వండాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తమకు కార్మిక చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ప్రధానంగా గౌరవ వేతనా న్ని కార్మిక చట్టం రూ. 10,500కు పెంచాలని, అది కూడా నెల నెలా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పీఎఫ్, ఈపీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకవెళ్లా....కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే, కోరుట్లప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మి కుల గౌరవ వేతనం పెంపు సమస్యను ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్లాను. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకవెళ్లడం వల్ల సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించారు.నెలకు రూ. 10,500 గౌరవ వేతనం ఇవ్వాలిసుతారి రాములు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకుడువంట కార్మికులకు గౌరవ వేతనాన్ని కార్మిక చట్టం ప్రకారం నెలకు రూ. 10,500 అందించాలి. అది కూడా నెల నెలా చెల్లించాల్సి ఉంటుంది. పీఎఫ్, ఈపీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని డిమాండ్ చేస్తు న్నాం. మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు, కార్మికుల సమస్యలను సర్కా రు పరిష్కరించాలి.చాలా సంతోషం

తాడెపు భాగ్య, వంట కార్మికురాలు, బుగ్గారందాదాపుగా పుష్కరకాలంగా వంట కార్మికుల గౌరవ వేతనాలను పెంచాలని అడుగుతున్నాము. ప్రస్తుతం సీఎం కేసీఆర్ వంట కార్మికుల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 పెంచడం వల్ల కొంత వరకైనా ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి.

# ఎస్సీ నియోజకవర్గాల్లో బీజేపీ కార్యాచరణ




కరీంనగర్ : బీజేపీ ఎస్సీ నియోజకవర్గాల్లో తన ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, ఆశావహులుగా ఉన్న అభ్యర్థుల పరిస్థితిపై క్షేత్రస్థాయి అధ్యయనానికి పంపిన పార్టీ బృందాలు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నాయి. ఇప్పటికే మూడు సార్లు పర్యటించి పలు అంశాలపై ఒక అవగాహనకు వచ్చిన ఆ బృందాలు ఇచ్చిన రిపోర్టులపై పార్టీ రాష్ట్ర నాయకత్వం మూడుసార్లు చర్చించింది. వివిధ అంశాలవారీగా పలు విడతల్లో పార్టీ బృందాలు నియోజకవర్గాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తున్నాయి. రాష్ట్రంలో 19 ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండగా అందులో ఐదు నియోజకవర్గాలు కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోనే ఉన్నాయి. ఇందులో మూడు నియోజకవర్గాలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ సొంత జిల్లా అయిన పాత కరీంనగర్ పరిధిలోనివే కావడంతో పార్టీ నాయకత్వం ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. ఇక్కడ గెలిచినా, ఓడినా ఆ ఫలితాలు రాష్ట్ర అధ్యక్షుడి ఖాతాలోనే పడనున్నందున ప్రత్యేక దృష్టితో ముందుకు సాగుతున్నట్లు తెలిసింది.

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ

ఎస్సీ నియోజకవర్గాల్లో గెలుపు సాధించే లక్ష్యంతో పార్టీ జాతీయ నాయకత్వం సూచనలతో రాష్ట్ర నాయకత్వం మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీలోని తొమ్మిది మంది సభ్యులు, ఇద్దరు, ముగ్గురి చొప్పున బృందాలుగా ఏర్పడి ఇప్పటికే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మానకొండూర్, చొప్పదండి, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో పర్యటించి క్షేత్రస్థాయి అధ్యయనాన్ని ప్రారంభించినట్లు తెలిసింది. ఎస్సీ నియోజకవర్గాల్లో బీజేపీ ఇప్పటివ రకు ఎందుకు విజయం సాధించలేకపోయింది, నియోజకవర్గాల్లో పార్టీ బలమెంత, ఇప్పటి వరకు పోటీ చేసిన అభ్యర్థులు, టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులకు ప్రజల్లో ఎలాంటి పేరుంది. వారి బలాబలాలేమిటి, ఎస్సీ కులాలవారే కాకుండా ఇతర కులాలవారికి ఆయా అభ్యర్థులపై ఎలాంటి అభిప్రాయముంది. వారికి ఆమోదం ఉందా, పార్టీ క్షేత్రస్థాయిలో ఎలా ఉంది, మండల, గ్రామ, బూత్ కమిటీలు ఉన్నాయా, ఉంటే నామమా త్రంగా ఉన్నాయా, ప్రజలతో సంబంధాలు పెట్టుకున్నాయా అన్న అంశాలపై ఈ పార్టీ బృందాలు అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే మూడుసార్లు ఈ బృందాలు రాష్ట్ర నాయకులతో భేటీ అయి ప్రాథమికంగా తాము సేకరించిన అంశాలను వివరించి చర్చించినట్లు సమాచారం.

పలు అంశాలపై దృష్టి

కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ ఐదు ఎస్సీ నియోజకవర్గాలలో ప్రస్తుతం టీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వ్యక్తిగతంగా, పార్టీ పరంగా వారు నియోజక వర్గాల్లో ప్రజల అసంతృప్తిని ఎదుర్కొంటున్నారని, ఈ వ్యతిరేకతను అనువుగా మార్చుకొని ఇప్పటి నుంచే వ్యూహాత్మకంగా కష్టపడి పనిచేస్తే గెలిచే అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తున్నది. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఉన్న కమిటీలను చురుకుగా వ్యవహరించేలా కార్యాచరణను వారి ముందుంచాలని భావిస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలలో కేంద్రం వాటా, తదితర అంశాలను ప్రజలకు వివరించడంతోపాటు ఆయా పథకాల ప్రయోజనాలు వారికి అందేలా పార్టీ శ్రేణులు సహకరించేలా చూడాలని, పార్టీ సానుభూతి పరులతోపాటు తటస్థులపై దృష్టి పెట్టడమే కాకుండా ఇతర పార్టీలకు చెందిన వారిని బీజేపీలోకి తీసుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ఈ కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టాలని కూడా భావిస్తున్నట్లు సమాచారం.

అభ్యర్థుల ఎంపికపై దృష్టి

జిల్లా పరిధిలోని చొప్పదండి నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యురాలు బొడిగె శోభ అభ్యర్థిత్వం దాదాపుగా ఖరారైనట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆమె సొంత నియోజకవర్గమైన మానకొండూర్‌లో పోటీచేసే అవకాశాన్ని కోరుకుంటే పార్టీ పరిశీలించే అవకాశం లేకపోలేదని, లేకపోతే ఈ నియోజకవర్గంలో ఆమె అభ్యర్థిగా ఉంటారని చెబుతున్నారు. గతంలో ఇక్కడి నుంచి లింగంపల్లి శంకర్ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం ఆయన కూడా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉ న్నా పార్టీ గ్రూపు రాజకీయాల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వం వెనకబడి పోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆయన పేరుతోపాటు ఇతర పార్టీల నుంయి ఎవరినైనా పార్టీలోకి తీసుకునే అవకాశాలున్నాయా అన్న విషయంలో కూడా పార్టీ సర్వే బృందాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. బొడిగె శోభ నియోజకవర్గం మారే పక్షంలో మాత్రమే మరో అభ్యర్థి తెరపైకి వస్తారని చెబుతున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో గతంలో రెండుసార్లు పోటీ చేసి పరాజయంపాలైన గడ్డం నాగరాజుతోపాటు సొల్లు అజయ్‌వర్మ, దరువు ఎల్లన్న, కుమ్మరి శంకర్, జానపట్ల స్వామి, తదితరులు అభ్యర్థులుగా రంగంలో ఉ ండేందుకు ఆసక్తి చూపిస్తుండగా వారి విషయంలో పార్టీ బృందాలు అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గంలో గతంలో పోటీ చేసిన కన్నం అంజయ్య, పార్టీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, మాజీ ఎంపీ గడ్డం వివేక్ పోటీచేసే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. కన్నం అంజయ్యకు కూడా గ్రూపు రాజకీయాల నేపథ్యంలో టికెట్ ఇచ్చే అవకాశం ఉండకపోవచ్చనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. గతంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్ కుమార్ ప్రస్తుతం ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన రాష్ట్ర, జాతీయ నాయక త్వంతో సత్సంబంధాలు పెట్టుకోవడంతోపాటు పార్టీ కార్యక్రమాల అమలులో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనను ఎక్కడో ఒక చోట అభ్యర్థిగా నిలపడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతు న్నట్లు తెలిసింది. గడ్డం వివేక్ అవకాశాలను తీసివేయకున్నా ఆయన చెన్నూరు నుంచి కూడా టికెట్ ఆశిస్తుండడంతో వీరిద్దరి విషయం పార్టీ ప్రత్యేకంగా చూస్తుందని చెబుతున్నారు. చెన్నూరు నియోజకవర్గం నుంచి డాక్టర్ వివేక్‌తోపాటు అందుగుల శ్రీనివాస్, బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి అడ్వకేట్ హేమాజీ పేర్లతోపాటు ఇతర పార్టీలకు చెందిన వారిని పార్టీలోకి తీసుకుంటే ఎలా ఉంటుందనే విషయంలో కూడా పార్టీ బృందాలు అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ప్రజా సంగ్రామ యాత్ర ముగిసిన తర్వాత ఎస్సీ నియోజకవర్గాల కార్యాచరణపై మరోసారి సమావేశం నిర్వహించి ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# పోలీస్‌పై పొలిటికల్ ప్రెషర్!

ఖమ్మం : శాంతి భద్రతల పరిరక్షణలో నిజాయితీ, చిత్తశుద్ధి, పనితీరే ప్రామాణికంగా పోలీసుశాఖలో ఒకప్పుడు పోస్టింగు లు ఉండేవి. కానీ ఇప్పుడు ఆపరిస్థితి మారింది. బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియలు, ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీల నియామక వ్యవహారాల్లో వరంగల్ జోనల్ స్థాయి ఉన్నతాధికారులు ఇంటిలిజెన్సు ద్వారా నివే దికలు తెప్పించుకుని వారి పనితీరు ఆధారంగా పోస్టింగ్‌లు ఇచ్చే పద్ధతిపోయి.. అధికార పార్టీ నేతల కు అనుకూలంగా ఉండేవారికి పోస్టింగ్‌లు కల్పించే కాలం వచ్చింది. రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారిన తర్వాత అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతోనే ఎస్ఐ, సీఐ, డీఎస్పీలాంటి కీలక పోస్టుల నియామకాలు, బదిలీలు సాగుతున్నాయి. సిఫారసు లేఖలు, పొలిటికల్ ప్రెషర్‌తో పోలీ సులు వివాదాల్లో చిక్కుకుంటుండగా.. శాంతిభద్రతల పరి రక్షణలో 'గులాబీ' వాసన గుప్పుమంటోంది. కొందరు పోలీసులైతే ప్రజల శాంతిభద్రతల కంటే ఎమ్మెల్యే లు, ఇతర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, పలుకు బడి ఉన్న నాయకుల కనుసన్నల్లోనే ఎక్కు వగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితం గా పలు కేసులు విషయంలో పోలీసు శాఖ అనేక విమర్శలు ఎదుర్కొంటుంది. వివాదాలు.. విమర్శల్లో పోలీసులుఖమ్మానికి చెందిన బీజేపీ అనుబంధ మజ్దూర్ సంఘ్‌జిల్లా అధ్యక్షుడు సాయిగణేష్ ఆత్మహత్య వ్యవ హారంతో పోలీసుశాఖ మరింత అప్రదిష్టను మూట గట్టుకోవాల్సి వచ్చింది. సాయిగణేష్ స్టేషన్ వద్దే పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి.. చికి త్స పొందుతూ మృతిచెందడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే సాయిగణేష్‌పై 16కు పైగా కేసులు ఉ ండడం, రౌడీషీట్ తెరవడం, ఆయన ఆత్మహత్య సంఘటనలో కీలకంగా మారాయి. ఈ ఘటనలో ఖమ్మం పోలీసులపై.. గవ ర్నర్‌కు, కేంద్ర హోంశాఖకు ఫిర్యా దుచేస్తామని బీజేపీ నేతలు ప్రక టించారు. ఖమ్మంలో కార్పొరేషన్ ఎన్నికల సమయంలో, ఇతర సందర్భాల్లోనూ పోలీసులు తీసు కున్న చర్యలు వివాదాస్పదమ య్యాయి. ఇద్దరు కాంగ్రెస్ కార్పొ రేటర్ల భర్తలపై రౌడీషీట్లు, పోలీసు కేసులు నమోదు చేసి విమర్శల పాల య్యారు. మట్టి తవ్వకాల విషయమై లోకాయుక్తకు ఫిర్యా దుచేసిన ఓ గిరిజన సంఘం నాయ కుడిపైనా రౌడీషీట్‌తోపాటు కేసులు పెట్టిన సందర్భా లున్నాయి. ఇక సోషల్‌మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టింగ్ పెట్టిన మహిళపైనా కేసులు పెట్టి వేధించారన్న విషయం ఇటీవల తీవ్ర కలకలం రేపింది. అయితే ప్రస్తుత పోలీసు అధికారులు మహి ళా కార్పొరేటర్ల భర్తలు ఇద్దరిపైనా గతంలోనే కేసులు, రౌడీషీట్లు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా తాము పెట్టిందేమీ లేదని చెబుతుండ టం గమనార్హం. ఎక్కువవుతున్న రాజకీయ జోక్యంగతంలో ఎన్నడూలేని విధంగా జిల్లా పోలీసు శాఖలో రాజ కీయ జోక్యం మితిమీరిందన్న విమర్శలున్నాయి. నిజాయితీగా పనిచేద్దామనుకుంటున్న కొందరు అధికారులు కూడా పలు పరిస్థితుల దృష్ట్యా అధికారపార్టీకి మొగ్గుచూపుతున్నారన్న అప వాదు మూటగట్టుకుంటున్నారు. మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో టీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పోలీసుస్టేషన్లే వేదికగా రాజకీయాలు నడిపిస్తున్నారని, కేసులు పెట్టాలన్నా, ఫిర్యాదుదారుల బాధలు వినాలన్నా తొలుత వారి వెనుక ఎవరున్నారన్న విషయం తెలుసుకున్నాకే కేసులు నమోదు చేసే స్థాయికి వారు ప్రభావం చూపుతున్నారని అర్థమవుతోంది. ఈక్రమంలో అధికార పార్టీనేతలు ప్రత్యర్థి పార్టీలే కాదు.. సొంత పార్టీలోని వైరి వర్గాలపైనా తమ పలుకుబడిని ఉపయోగించి కేసుల్లో ఇరికిస్తున్నారన్నది బహిరంగ సత్యమే. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో.. ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో పోలీసులు పనిచేస్తున్నారన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పాలేరు నియోజకవర్గంలో మాజీమంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వర్గాల మధ్య జరుగుతున్న వార్‌లో కూడా పోలీసులు ఎమ్మెల్యేపక్షం వహిస్తు న్నారన్న ఆరోపణలున్నాయి. తుమ్మల వర్గానికి చెంది న నేలకొండపల్లి టీఆర్ఎస్ నాయకుడిపై రౌడీషీట్ తెరవడం, ఖమ్మంరూరల్ మండలంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఇటీవల 24 మందిపై కేసు పెట్టి అరెస్టు చేయడం, ఇదే మండలంలో మాజీసర్పంచ్‌పై పొలిటికల్ ప్రెషర్‌తో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి అరెస్టు చేయడం లాంటివి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. తిరుమలాయ పాలెం మండలంలో కూడా తుమ్మలవర్గీయులపై గతంలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే పాలేరు నియోజకవర్గంలో మరికొందరిపైనా కేసులు నమోదుచేసేందుకు పోలీసులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కూడా టీఆర్ఎస్‌లోని ప్రత్యర్థి వర్గీయులపైన, అలాగే విపక్ష నాయకులు, కార్యకర్తలపైనా ఎమ్మెల్యేలు కేసులు పెట్టించేందుకు పోలీసులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఒకవేళ ఎమ్మెల్యేల మాట వినకుంటే పోస్టింగ్‌లో వేటుపడుతుందనే భయంతో పోలీసులు కూడా తల ఊపుతున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా పోలీసులు వారికి గుడ్‌మార్నింగ్ చెప్పి విధులు ప్రారంభించి గుడ్‌నైట్ వరకు వెంట తిరుగు తున్నారన్న అపవాదుంది. చివారకు శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్లేప్పుడు కూడా పోలీసులు వారి వెంటే ఉంటుండటం గమనార్హం. ఒకప్పుడు మావో యిస్టు ప్రభావిత, సున్నిత ప్రాంతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పర్యటించినప్పుడు మాత్రమే రక్షణగా ఉండే ఎస్ఐలు, సీఐలు, పోలీసులు.. ఇప్పుడు ఏకంగా ప్రతీ చిన్న పర్యటనకు కూడా కాన్వాయ్‌లా ఉంటూ ప్రత్యేక ప్రొటోకాల్ పాటిస్తున్నట్టు విమర్శలున్నాయి. ఈ పరిస్థితులు పోలీసుశాఖ ప్రతిష్టకు ఇబ్బంది కరంగా మారుతుండటాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు పొలిటికల్ ఒత్తిళ్లను పక్కనబెట్టి పనిచేస్తేనే ప్రజల మన్ననలు పొందుతారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# వడ్డీ దందా.. కొత్త పంథా!

ఖమ్మం :వడ్డీ వ్యాపారం ముసుగులో దౌర్జన్యం చేస్తే ఉపేక్షించేది లేదు. జిల్లాలో జరుగుతున్న అక్రమ వడ్డీ వ్యాపారంపై నిఘా పటిష్టం చేశాం. బాధితులకు చట్టపరమైన సహాయ సహకారాలను అందిస్తాం. ఎదుటివారి ఆర్థిక అవసరాలను, కష్టాలను ఆసరాగా చేసుకుని కొందరు వడ్డీ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అప్పులిస్తూ సకాలంలో చెల్లించని వారిని వేధిస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తప్పవు. అధిక వడ్డీలు చెల్లించలేక మానసిక, ఆర్థిక ఒత్తిడితో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేయడం, ఖాళీ చెక్కులు, ఏటీఎం కార్డులు, బంగారు ఆభరణాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇళ్లు, ఖాళీస్థలాలు, వాహనాలు కుదవ పెట్టుకుని ఇచ్చే దళారులే అత్యధికంగా ఉన్నారు. వారిపై దృష్టిసారించాం.

ఇదీ ఖమ్మం సీపీ విష్ణు ఎస్ వారియర్ ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన ప్రకటనలోని సారాంశం. అయినా జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ఆయన ఆదేశాలను జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతోనే బాధితులకు న్యాయం జరగడంలేదన్న వాదన వినిపిస్తోంది. అధిక వడ్డీ వ్యాపారం సామాన్యుడి నడ్డి విరుస్తోంది. రూ.10 నుంచి రూ.30 వడ్డీ వసూలు చేస్తూ కొందరు వ్యాపారులు జిల్లాలో వడ్డీ దందా చేస్తున్నారు. నగదు అవసరం ఉన్న వ్యక్తులే టార్గెట్‌గా ఈ దందా సాగిస్తున్నారు. గతంలో తమ వద్ద ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు పెట్టుకుని వడ్డీ దందా చేసేవారు. కానీ రానురాను ఆ దందా కొత్త రూపం దాల్చింది. నగదు అవసరమున్న వారి నుంచి ఇళ్లు, లేదా ఖాళీస్థలాలు కుదవ పెట్టుకుని నగదు ఇచ్చే స్థాయి నుంచి ఏకంగా సేల్‌డీడ్‌లు రాయించుకుని దందాకు పాల్పడుతున్నారు జిల్లాలోని కొందరు వడ్డీ వ్యాపా రులు. అనంతరం వాటిని అడ్డుగా పెట్టుకుని తాము అడిగినంత నగదు చెల్లించాలని బెదిరింపులకు దిగడం ప్రారంభిస్తున్నారు. అంతమొత్తంలో నగదు ఇవ్వని పక్షంలో తమ పేరిట చేసిన సేల్‌డీడ్‌ను రిలీజ్ చేసేది లేదంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అయితే అధిక వడ్డీ వ్యాపారం నిర్వహించే వారిలో కొందరు కిందిస్థాయి పోలీసు సిబ్బంది ఉండగా.. అత్యధికశాతం టీచర్లు ఉ న్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఈ దందాకు తెరలేపినట్టు విమర్శలు లేకపోవు. కొన్నిప్రాంతాల్లో పోలీసు అధికారుల అండదండలతోనే వడ్డీ వ్యాపారులు తమ ఆగడాలను విస్తృతం చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హామీ పెట్టిన ఆస్తులకు హక్కులు..ఎవరైనా అవసరాలకు నగదు తీసుకున్న తర్వాత సదరు వడ్డీ వ్యాపారులు చట్టబద్ధం కాని వడ్డీ వసూలు చేస్తారు. కానీ ఆయా వసూళ్లు మాత్రం కనబడవు. తీసుకున్న నగదు మొత్తంతో పాటు వడ్డీ చెల్లించినా వారికి ఆ నగదు సరిపోదు. వారం పది రోజులు లేటయిందా ఇక అంతే.. మళ్లీ వడ్డీ నగదు, అసలు నగదుకు సమానమవుతోంది. నగదు తీసుకునే సమయంలో ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకుని దగ్గర పెట్టుకునే సదరు వ్యాపారులు, వడ్డీకి నగదు తీసుకునే వారి పేరుమీద ఉన్న ఆస్తులను కూడా తమ పేరుమీద మార్చుకునే హక్కును పొందుతున్నారు. కొద్దీ గొప్ప వడ్డీ చెల్లించాల్సి ఉన్న సమయంలో దానికి రెండింతలు చెల్లించాలని లేదంటే అంతకంటే ఎక్కువ విలువచేసే తమ ఆస్తులను వారిపేరుమీద మార్చుకుంటామని బెదిరింపులకు పాల్పడటం జిల్లాలో పరిపాటిగా మారినట్టు తెలుస్తోంది. అంతేనా ప్రస్తుతం భూముల విలువలు పెరిగిన క్రమంలో కొందరు అక్రమ వ్యాపారం చేసే వడ్డీ వ్యాపారులు ఆయా సేల్ డీడ్‌లను ఇతరుల దగ్గర, బ్యాంకుల్లో పెట్టి అసలు యజమానికి ఇచ్చిన నగదుకంటే నాలుగింతల నగదు తీసుకుంటున్నారు. తీరా అసలు యజమానులు తమ పత్రాలు ఇవ్వాలని అడిగితే వారు వేరేచోట తీసుకున్న నగదు మొత్తం చెల్లిస్తేనే ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.

# 'ఉపాధి' నిధులే దిక్కు

పెద్దపల్లి : గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం నిధులు భరోసా ఇస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించక పోవడంతో పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల నిధులపైనే ఆధారపడాల్సి వస్తున్నది. ఇందులో ప్రధానంగా ఉపాధిహామీ పథకం నిధులను పెద్దఎత్తున గ్రామాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకుంటున్నారు. – 'పల్లె ప్రగతి' పనులకు..రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లె ప్రగతి పథకంలో చేపట్టే అత్యధిక పనులను ఉపాధి హామీ పథకం ద్వారానే చేపట్టారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రెండు లక్షల వ్యయంతో సెగ్రిగేషన్ షెడ్‌లను నిర్మించారు. దీని ద్వారా తడి చెత్త, పొడి చెత్తతో పాటు ఇతరత్రా చెత్తను వేరు చేసి దానిని విక్రయించుకునేందుకు వీలుగా షెడ్‌ను నిర్మించారు. ఒక వ్యక్తి చివరి మజిలీ సాఫీగా సాగేందుకు గానూ ప్రతి పంచాయతీ పరిధిలో వైకుంఠధామాలను చేపట్టారు. ఒక్కో దానికి సుమారు 12 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. హరితహారం పథకం ద్వారా పెంచుతున్న మొక్కలను ఎక్కువగా ఉపాధిహామీ పథకం లో భాగంగా పెంచడంతో పాటు వాటిని నాటి సంరక్షించేందుకు కూడా ఉపాధి నిధులనే వాడుకుంటున్నారు. ప్రతీ క్లస్టర్‌కు నిర్మించిన రైతు వేదిక నిర్మాణానికి అయిన 22 లక్షల రూపాయల్లో 10 లక్షల వరకు ఉపాధి నిధులను వినియోగం చేసుకున్నారు. – శాశ్వత నిర్మాణాల కోసం..గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించేందుకు, వలసలను అరికట్టేందుకు గాను అప్పటి కేంద్ర ప్రభుత్వం 2005–06లో ఉపాధి హామీ పథకాన్ని ఆరంభించారు. ఈ పథకం ద్వారా జాబ్ కార్డులు పొందిన కుటుంబాలకు 100 రోజుల పాటు పని కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. కూలీలకు కల్పించిన పని విలువలో 40 శాతం నిధులను శాశ్వత నిర్మాణాల కోసం వెచ్చించాలని పేర్కొన్నారు. ఈ నిధులతోనే గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాలు, సీసీ రోడ్లు, మురికి కాలువలను నిర్మించడంతో పాటు చెక్ డ్యామ్‌లు, ఇతరత్రా అనేక పనులను చేపడుతున్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 85 శాతం నిధులను నేరుగా విడుదల చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంస్థ ద్వారా కొన్ని నిధులను ఇస్తున్నది. ఇంకా గ్రామాల అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ, సీనరేజీ నుంచి నిధులు వస్తున్నాయి. ఏసీడీపీ, ఎంపీ ల్యాడ్స్ నిధులు అరకొరగా వస్తున్నాయి. పంచాయతీల ద్వారా వసూలయ్యే పన్నుల సొమ్ము దాని నిర్వహణకు కూడా సరిపోవడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచే కరెంట్ బిల్లులు చెల్లించాల్సి వస్తున్నది. గ్రామాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు చాలా తక్కువ. కేంద్రం నుంచి ఆయా గ్రాంట్ల ద్వారా నిధులు రావడంతో పాటు ఉపాధి హామీ పథకం గ్రామాలకు ఎంతగానో దోహదపడు తున్నాయి.

# పేదల బియ్యం పక్కదారి

సిరిసిల్ల : ప్రభుత్వాలు పేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో కొందరు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా పొరుగు జిల్లాలకు రవాణా చేస్తున్నారు. జిల్లాలోని కొందరు మిల్లర్లు రైస్‌మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికే ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొవిడ్ ఉధృతితో ఉపాధి కోల్పోయి లబ్ధిదారులు ఇబ్బందుల్లో ఉన్నారన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. తాజాగా నవంబరు వరకు ఉచిత బియ్యం పంపిణీని పొడిగించారు. ఉచితంగా వస్తున్న బియ్యాన్ని దళారులు కొందరు డీలర్ల వద్ద నుంచి, ఇంటింటికి తిరిగి సేకరించి మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పౌరసరఫరాల అధికారులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తరచూ పట్టుకుంటున్న బియ్యమే ఇందుకు ఉ దాహరణలుగా నిలుస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట, వీర్నపల్లి మండలాల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టి పట్టుకుం టున్నా దందా మాత్రం ఆగడం లేదు.

కాసులు కురిపిస్తున్న దందా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 344 రేషన్ దుకాణాలు ఉండగా 1,75,445 కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,61,524, అంత్యోదయ కార్డులు 13,687, అన్నపూర్ణ కార్డులు 234 ఉన్నాయి. వీటి పరిధిలో 5,07,905 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 53,80,950 కిలోల బియ్యం అవసరం అవుతున్నాయి. డీలర్ల వద్ద నిల్వ బియ్యం కలుపుకొని ప్రతి నెలా 47,88,426 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఉచితంగా బియ్యం పంపిణీ కావడంతో ఎక్కువ శాతం బియ్యం ఇళ్లల్లో నిల్వ ఉ ంటున్నాయి. కొందరు లబ్ధిదారులు డీలర్ల వద్దనే బియ్యం వదిలేసి డబ్బులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు కొంత మంది ముఠాగా ఏర్పడుతున్నారు. ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి నేరుగా కిలోకు రూ.10 చొప్పున కొంటున్నారు. సేకరించిన బియ్యాన్ని రూ.15 నుంచి 18 రూపాయల వరకు మిల్లర్లకు



విక్రయిస్తున్నారు. కోళ్ల దాణా కోసం ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి కూడా పంపిస్తున్నారు. జిల్లాలో కొందరు మిల్లర్లు రీసైక్లింగ్ ద్వారా సీఎంఆర్ కింద మళ్లీ ప్రభుత్వానికే పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దందాతో కొందరు మిల్లర్లు లక్షల్లో అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరగాలనే డిమాండ్లు కూడా ఉన్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం భారీ ఎత్తున సేకరణ జరుగుతున్నా నిఘా మాత్రం నామమాత్రంగానే ఉ ంది. రూ.16.80 లక్షల విలువైన బియ్యం పట్టివేత రాజన్న సిరిసిల్ల జిల్లాలో గడిచిన 77 రోజుల్లో రూ. 16.80 లక్షల విలువైన 1,578 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. తంగళ్లపల్లిలో ఒక్కరోజే 1050 క్వింటాళ్ల బియ్యం పట్టుబడడం చూస్తే ఎంత యథేచ్ఛగా బియ్యం రవాణా జరుగుతుంతో తెలుస్తోంది. బియ్యం పట్టుకొని 6 ఏ కేసులు నమోదు చేసినా అక్రమార్కులు బెదరడం లేదు. ఫిబ్రవరిలో 88 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని 5 మందిపై కేసులు నమోదు చేశారు. మార్చిలో 358 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని 11 మందిపైనా, ఏప్రిల్‌లో 1132 క్వింటాళ్లు స్వాధీనం చేసుకొని 10 మందిపైనా కేసులు నమోదు చేశారు. దాడులు పెరిగినప్పుడు గప్‌చుప్‌గా మౌనం దాలుస్తూ మళ్లీ య?థావిధిగా బియ్యం దందాకు తెరలేపుతున్నారు. నిరంతరం అక్రమ దందాపై నిఘా కొనసాగాలనే డిమాండ్ ఉన్నా అధికారులు పట్టించుకో వడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# వైయస్‌ఆర్ జిల్లాలో సీఎం వైయస్ జగన్ పర్యటన



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు (బుధవారం) వైయస్‌ఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. వైయస్‌ఆర్ జిల్లాలోని ఒంటిమిట్టలో జరుగుతున్న శ్రీ కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సీఎం వైయస్ జగన్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

**సీఎం పర్యటన షెడ్యూల్..** మధ్యాహ్నం 12.50 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 1.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.15 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 2.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2.35 గంటలకు ఒంటిమిట్టలోని టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు. 3.25 గంటలకు టీటీడీ అతిథి గృహం నుంచి బయలుదేరి ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి చేరుకుంటారు.

3.30 నుంచి 3.50 గంటల వరకు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 3.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి టీటీడీ అతిథి గృహానికి చేరుకుంటారు. 4.25 గంటలకు టీటీడీ అతిథి గృహం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.55 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 5.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 5.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని 6.10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు



# భగవాన్ మహావీర్‌కు సీఎం వైయస్ జగన్ నివాళి

తాడేపల్లి: ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మహావీర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భగవాన్ మహావీరుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, రమేష్ జైన్, రవి కొఠారి, నిర్మల్ జైన్, పలువురు జైనులు పాల్గొన్నారు.

# 72 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు: రైల్వే శాఖ మంత్రి



ఢిల్లీ: ఏపీలో అమృత్ భారత్ పథకం కింద 72 స్టేషన్లలో అభివృద్ధి పనులు జరిగాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఏపీలో వివిధ రైల్వే ప్రాజెక్టులపై ఎంపీ జీవీఎల్ నరసింహారావు పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. 2022 ఏప్రిల్ నెల వరకు రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి సంబంధించి 16 కొత్త లైన్లు, 15 డబ్లింగ్ లైన్లు మొత్తం 31 ప్రాజెక్టులు కేటాయించామన్నారు.

వాటి దూరం 5,581 కిలోమీటర్లు కాగా, 70,594 కోట్లుతో చేపట్టామన్నారు. ఈ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, మార్చి 2022 వరకు 636 కిలోమీటర్ల దూరాన్ని 19,414 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే 2014-19 మధ్య 219 శాతానికి పైగా రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులు పెంచడం జరిగిందని జీవీఎల్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు

**అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద 72 స్టేషన్ల అభివృద్ధి** : అమృత్ భారత్ స్టేషన్ స్కీం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి దేశవ్యాప్తంగా 1275 రైల్వే స్టేషన్లను, వాటిలో 72 స్టేషన్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించగా అందులో 53 స్టేషన్లలో ఇప్పటికే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# జగన్ కీలక భేటీకి డుమ్మా కొట్టిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల తాజా వ్యాఖ్యలివి..



గుంటూరు: సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం సమీక్ష సమావేశంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి డుమ్మాకొట్టారు. దీంతో ఆయన పార్టీ మారుతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ఈ వార్తలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి క్లారిటీ ఇచ్చారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... పార్టీ మారతారనేది అవాస్తవమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఉన్నంతవరకు జగన్ వెంటే... లేకపోతే పొలం బాట అని చెప్పుకొచ్చారు. అనారోగ్య సమస్యతో నిన్న సీఎం సమావేశానికి హాజరుకాలేదని తెలిపారు. తనకు ఎప్పటికి నాయకుడు జగన్ రెడ్డే అని అన్నారు. అవసరమైతే పొలం పనులు చేసుకుంటాను తప్ప బాస్‌ను ఎదురించనని అన్నారు. తమ నాయకుడు జగన్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్న కట్టుబడి ఉంటానని ఆళ్ల రామకృష్ణ పేర్కొన్నారు. కాగా... 'గడప గడపకు మన ప్రభుత్వం'పై తాడేపల్లి ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌కు ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడిన ఆళ్ళ రామకృష్ణారెడ్డి డుమ్మా కొట్టడం విస్మయాన్ని కలిగించింది. క్యాంపు కార్యాలయం తన నియోజకవర్గ పరిధిలో.. కూతవేటు దూరంలోనే ఉన్నా కొంతకాలంగా ఆయన అటు వైపే వెళ్లడం లేదని... ఆ గడప తొక్కడానికి కూడా ఇష్టపడడం లేదని వార్తలు వినిపించాయి. జగన్‌తో అగాధం పెరగడమే దీనికి కారణమని వైసీపీ వర్గాలు అంటున్నాయి. జగన్‌కు మద్దతుగా ఆళ్ల అనేక మందిపై కోర్టుల్లో కేసులు దాఖలు చేశారు కూడా. అంతటి వీరాభిమాని కొంతకాలంగా అసంతృప్తితో రగిలిపోతున్నారని... అలాగని బయటపడకుండా మౌనముద్ర దాల్చారని జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలన్నీ ఆళ్ల ఒక్క సమాధానంతో పటాపంచలైపోయాయి.

తన బాస్ జగన్ రెడ్డే అని... రాజకీయాల్లో ఉన్నంత వరకు జగన్ వెంటే ఉంటానని.. ఒకవేల లేని పక్షంలో పొలం పనులు చేసుకుంటానే తప్ప వేరే పార్టీలోకి వెళ్లే ప్రస్తక్తే లేదని చెప్పడంతో ఆళ్ల రామకృష్ణారెడ్డిపై వస్తున్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడినట్లైంది.

# నెల్లూరు జిల్లాలో సిలికా దోపిడీ..




నెల్లూరు: జిల్లాలో అధికారపార్టీ కనుసన్నల్లో బరితెగించి మరీ సిలికా దోపిడీ జరుగుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చిల్లకూరు, కోట మండలాల్లో లభించే అరుదైన సిలికా శాండ్ మైనింగ్‌లో మూడేళ్లలో రూ.3 వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. సముద్రతీర ప్రాంతంలో సాగరమాల ప్రాజెక్ట్ కోసం ఏర్పాటు చేసిన రోడ్డుని కూడా తవ్వేశారన్నారు. 2.50 మీటర్ల తవ్వకాలకు మాత్రమే అనుమతి ఉంటే, 5, 6 మీటర్ల లోతు తవ్వుతున్నారని విమర్శించారు. కర్నూలు జిల్లాలో అనుమతులు తీసుకొని, నెల్లూరులో మెటీరియల్ కాజేస్తున్నారని సోమిరెడ్డి అన్నారు. 78 మంది లీజుదారుల మెడపై కత్తిపెట్టి మరీ, ఇష్టానుసారం తవ్వకాలు జరుపుతూ, టన్ను రూ.1485కు అమ్ముకుంటున్నారని, జీఎస్టీ మాత్రం రూ.700 కడుతున్నారని అన్నారు. తనదారికి తెచ్చుకోవడం కోసం సీఎం జగన్మోహన్ రెడ్డి తన.. మన అనే తేడా లేకుండా మైనింగ్ దారుల్లోని వైసీపీ వారిపై కూడా రూ.300 కోట్ల వరకు పెనాల్టీలు వేశారన్నారు. నెల్లూరు జిల్లాలో యథేచ్ఛగా జరుగుతున్న సిలికా దోపిడీపై తక్షణమే కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ జోక్యం చేసుకోవాలని సోమిరెడ్డి కోరారు. ఈ దోపిడీపై సీబీఐతో విచారణ జరిపించి పెద్ద తలకాయలు ఎవరున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న సిలికా మైనింగ్ సీబీఐ, ఈడీ , ఫెమా, ఎన్జీటీ విభాగాలు అన్నీ దృష్టిపెట్టాల్సిన దోపిడీ వ్యవహారమని సోమిరెడ్డి పేర్కొన్నారు.

# జగన్ ఢిల్లీ టూర్లపై అసలు నిజం చెప్పిన కన్నా

పల్నాడు: వైసీపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సమస్యలను పట్టించుకునే స్థితితో జగన్ ప్రభుత్వం లేదన్నారు. అకాలవర్షాలతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.మీరు నాకు.. నేను మీకు అని ఎమ్మెల్యేలతో జగన్ అంటున్నారని చెప్పారు. బటన్ నొక్కడం తప్ప నియోజకవర్గాలకు ఏం ఇచ్చారో జగన్ చెప్పాలని కన్నా డిమాండ్ చేశారు. స్వప్రయోజనాలు, బాబాయ్ హత్య కేసు విషయమే జగన్ ఢిల్లీ టూర్లన్నారు



# మద్యం లేకపోతే వైసీపీ ప్రభుత్వమే లేదు..

విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీత అన్న సీఎం జగన్.. మద్యపాన నిషేధంపై ఒక్క రివ్యూ అయినా పెట్టారా? అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి మద్యపాన నిషేధం చేయకుండా ఓట్ల కోసం వస్తే, మహిళలు చెప్పులతో తరిమి తరిమి కొట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. మద్యపానంలో నేషనల్, ఇంటర్నేషనల్ బ్రాండ్స్ పోయి కొత్త బ్రాండ్స్ వచ్చాయని, మద్యం లేకపోతే వైసీపీ ప్రభుత్వం లేదన్నట్లు తయారైందని అనిత అన్నారు. మద్యం తయారీ మీద నాలుగేళ్లలో రూ. 38 వేల కోట్లు తాడేపల్లి కొంపకు చేరాయన్నారు. మహిళల తాళిబొట్లు, మానప్రాణాలతో ఆడుకుంటున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

రాష్ట్ర ఆదాయం సంవత్సరానికి లక్ష కోట్లు వస్తుందని ఆర్థిక శాఖ మంత్రి పిట్ట కథలు చెప్పారన్నారు. కేవలం రూ. 25 వేల కోట్ల ఆదాయం మద్యం మీదే వస్తోందన్నారు. రూ. 95 వేల కోట్ల మద్యాన్ని ప్రజలతో తాగించడాన్ని మద్యపాన నిషేధమంటారా? అని ప్రశ్నించారు. ఈరోజు మద్యం షాపులో క్యూఆర్ కోడ్ లేదంటే ఎలా దోచుకుంటున్నారో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. తాగుబోతులను కూడా తాకట్టు పెట్టిన ప్రభుత్వం ఇదని వంగలపూడి అనిత అన్నారు.




# వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులపై పచ్చి అబద్దాలు ప్రచారం : బుగ్గన



అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిపక్షాల పత్రికా ప్రకటనలు, కొన్ని పత్రికల్లో వస్తున్న కథనాలు పచ్చి అబద్ధాలని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 మార్చి 31 నాటికి తమ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,64,725 కోట్లే అని వెల్లడించారు. టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం రెండింతల అప్పులు చేసినట్లు అధికారిక ప్రకటనలో తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ 59,729 కోట్లు వేస్ అండ్ మీన్స్ నిజం కాదా? అని ప్రశ్నించారు. "ఖజానా ఖాళీ!, రూ.100కోట్ల నిధి మాత్రమే మిగిలింది. ఎక్కడెక్కడ అప్పులొస్తాయో అన్నీ తెచ్చేశాం. ఒక్క రూపాయి కూడా ఇక అప్పు పుట్టదు. వైసీపీ ప్రభుత్వం మొదటి 6 నెలల్లోనే అప్పుదొరకక ఆదాయం లేక ఇంటికి వెళుతుంది" అంటూ గతంలో ఆర్థిక శాఖ మంత్రిగా చేసిన యనమలగారు వేర్వేరు సందర్భాలలో చేసిన వ్యాఖ్యలివి! ఇప్పుడేమో రాష్ట్రం అప్పు రూ. 12.5 లక్షల కోట్లు దాటనుందని జోస్యం చెబుతున్నారు. అలాగే చంద్రబాబు గారు కూడా రాష్ట్రం అప్పు రూ. 10.31 లక్షల కోట్లు చేరిందని ఆయనే నిర్ధారించి సభల్లో ఇష్టమొచ్చినట్లు ప్రకటిస్తున్నారు. కొద్ది నెలల క్రితం వరకూ ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంకగా, నైజీరియాగా, జింబాబ్వేగా మారబోతోందని ప్రతిపక్ష నేతలు ఇలాగే గగ్గోలు పెట్టారు. టీడీపీ నాయకులలో రాష్ట్ర ఆర్థిక స్థితిపై సరైన అవగాహన లేక నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు చెప్పడమే పనిగా పెట్టుకున్నారు. ఈ దుష్ప్రచారాలతో రాష్ట్ర ప్రజలలో ఒక రకమైన గందరగోళాన్ని సృష్టించి రాజకీయ లబ్ది పొందాలని విఫల యత్నంచేస్తున్నారు. వాస్తవానికి , మే నెల, 2019 లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పు రూ.2,71,797 కోట్లు. మార్చి 31 , 2023 నాటికీ రాష్ట్రం అప్పు రూ. 4,36,522 కోట్లు. ఈ లెక్కల ప్రకారం, ఈ నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులు అక్షరాలా రూ.1,64,725 కోట్లు మాత్రమే. అప్పు పెరుగుదలని పోల్చి చూస్తే, గత ప్రభుత్వ హయాం లో 2014 -19 లో కేంద్ర ప్రభుత్వ అప్పు Compound Annual Growth Rate (CAGR%) 9.89 పెరిగినప్పుడు, మన రాష్ట్ర అప్పు CAGR 19.02 % పెరిగింది. అంటే, టీడీపీ హయాంలో కేంద్రం కన్నా రాష్ట్రం రెండింతల అప్పులు చేసిందన్నడానికి అధికారిక గణాంకాలే నిదర్శనం. అదే వైసీపీ ప్రభుత్వ హయాంలో (జూన్ 2019 నుంచి మార్చి 2023) కేంద్ర ప్రభుత్వ అప్పు CAGR 14.37% పెరిగినప్పటికీ రాష్ట్ర అప్పు మాత్రం CAGR 13.55 శాతమే పెరిగింది. అంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పు నెమ్మదిగా పెరిగింది (SLOWER PACE) తప్ప మీరు చెప్పినట్టు కాదు. మీరు చేసినంత అప్పు అసలే లేదు. పైగా మా ప్రభుత్వం ఆ మాత్రం చేసింది కూడా కరోనా లాంటి మహమ్మారిని ఎదుర్కుంటూ సంక్షేమ పథకాలు ఏవీ ఆపకుండా ఉండడానికే..ప్రజలను కాపాడుకోవడానికే. తలసరి అప్పు రూ. 5.5 లక్షలని, అప్పులపై సంవత్సరానికి లక్ష కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తుందని సొంత లెక్కలు చెబుతూ యనమల గారు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇవి ముమ్మాటికి ప్రజలను తప్పు దోవ పట్టించే తప్పుడు లెక్కలు, పచ్చి అసత్యాలన్నది వాస్తవం. సెన్సస్-2011 ఆంధ్రప్రదేశ్ జనాభా 4.96 కోట్లు. ఈ జనాభా ప్రకారం తలసరి అప్పు రూ.88,008 మాత్రమే. అప్పులపై వడ్డీ చూస్తే 2022 - 23కి రూ. 25,754 కోట్లు మాత్రమే. ఒక మాజీ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి కూడా కనీస బాధ్యత లేకుండా రూ.లక్ష కోట్లు వడ్డీ కడుతుందని చెప్పడమంటే ముమ్మాటికి ఇది రాజకీయ ప్రయోజనాలు మినహా నిజాలు లేవని ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు ఏమైనా పర్వాలేదు, యువత భవిష్యత్తు నాశనమైనా మాకేం పోదు, పేదవారు కష్టాల ఊబిలో కూరుకుపోయినా మాకు సంబంధం లేదు, మాకు కేవలం వైసీపీ ప్రభుత్వాన్ని అసత్యాలతో, అనుకూల మీడియాతో భయాందోళనలోకి ప్రజలను నెట్టి ఎలాగైనా తిరిగి అధికారంలోకి రావాలని టీడీపీ పన్నిన దుష్ట పన్నాగం కాక మరేమిటి? వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్లు, ఓవర్ డ్రాఫ్ట్‌ని అప్పులలో కలిపి యనమల గారు కుతంత్రాలను జొప్పించి అర్థరహితంగా మాట్లాడుతున్నారు. ఇది ముమ్మాటికీ ఒక పథకం ప్రకారం వైసీపీ ప్రభుత్వంపై బురద చల్లాలని చేస్తున్న కుయుక్తే. భారతీయ రిజర్వు బ్యాంకు రాష్ట్రాలకు రోజు వారీ నగదు నిర్వహణకు గాను, వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్ వసతిని కల్పించింది. దీనిని వాడుకోవడమనేది ఏ ప్రభుత్వానికైనా సర్వసాధారణమైన విషయం. వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్ అనేవి తాత్కాలిక అప్పు మాత్రమే. 'వేస్ అండ్ మీన్స్' మరియు 'ఓవర్ డ్రాఫ్ట్' కింద మన రాష్ట్ర అప్పు సున్నా. టీడీపీ ప్రభుత్వం కూడా 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ 59,729 కోట్లు వేస్ అండ్ మీన్స్ గా పొందడం వాస్తవం కాదా? అందులో రూ. 139 కోట్లు తిరిగి చెల్లించకుండా వెళ్లి పోయిన మాట వాస్తవం కాదా? అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా 2020-21 సంవత్సరానికి గాను రూ 69,454 కోట్లు వేస్ అండ్ మీన్స్‌ను ఉపయోగించుకుంది. ఇదేదో ఇపుడే వైసీపీ ప్రభుత్వమే తొలిసారి చేస్తున్నట్లుగా వాస్తవాలను మరుగున పరచి అబద్ధాలను ఎందుకు ప్రచారం చేస్తున్నారో వారికే తెలియాలి. ఉదాహరణకు కోవిడ్ పరిస్థితుల్లో పేద వాడిని కష్టాల నుండి కాపాడుకోవడం కోసం నియమిత గడువులోపల ఒక సంక్షేమ పథకానికి నిధులు విడుదల చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉండకపోవచ్చు. అప్పుడు ఆర్బీఐ వద్దకు వేస్ అండ్ మీన్స్‌కు వెళ్లడం పరిపాటి. రాష్ట్ర ప్రభుత్వానికి రాబడి అధికంగా వచ్చినప్పుడు అది మిగులు బ్యాలెన్స్‌గా కూడా మారొచ్చు. ఇది తెలిసి కూడా అదేదో పెద్ద విషయమైనట్లు టీడీపీ నేతలు చిత్రీకరించే ప్రయత్నం చూడడానికి విడ్డూరంగా ఉంది. స్థిరమైన అభివృద్ధి లక్షాలలో 13వ స్థానంలో ఉందని, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ లో ఆంధ్రప్రదేశ్ 13వ స్థానంలో ఉందనే ప్రతిపక్షాల ప్రచారం కూడా నిజం కాదు. ఎక్కడ నుండి ఈ తప్పుడు సమాచారాన్ని కనిపెడతారో, కావాలనే ఈ కాకి లెక్కలు ఎలా సృష్టిస్తారో కూడా చెప్పాలని కోరుతున్నాను. నీతిఆయోగ్, భారత ప్రభుత్వం 2020-21 సంవత్సరంలో ప్రకటించిన ఎస్డీజీ ఇండెక్స్ ప్రకారం, ఈ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ 72 స్కోరుతో 4వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడేళ్లలో తన స్కోర్‌ను నిరంతరం మెరుగుపరుచుకుంటూ సత్తా చాటుతోంది. 2018-19లో ఉన్న ఆంధ్రప్రదేశ్ స్కోర్ 64 నుండి 2020-21నాటికి ఆ స్కోరు 72కి మెరుగుపడడం ఏపీ ప్రభుత్వ విధానాలకు ప్రతిబింబమన్న అసలు నిజం ప్రజలకు తెలియాలి. పైగా ప్రతిసారి ఈ స్కోరులో భారతదేశ సగటు స్కోరు కంటే ఆంధ్రప్రదేశ్ మెరుగ్గా ఉందని నీతిఆయోగ్ గణాంకాలే తేల్చాయి. చంద్రబాబు నాయుడు గారు 2022-23 లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం తెలంగాణతో పోల్చితే చాల వెనుకపడి ఉందంటున్నారు. మరి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో తెలంగాణ తలసారి ఆదాయం రూ. 2,09,848/- ఉంటే మరీ ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం కేవలం రూ. 1,54,031/- ఎందుకు ఉంది. అప్పుడు ఇప్పుడు తక్కువ తలసరి ఆదాయానికి కారణం చంద్రబాబు నాయుడు పాతకకృత్యాలే. ఓటుకు నోటు కేసు , ఇబ్బడిముబ్బడిగా అప్పులు,వడ్డీలతో ఆర్థిక విధ్వంసం. ఇవే ఏపీ వెనకబాటుతనానికి కారణం. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు నాయుడు గారు అడ్డంగా దొరికి పోయి హైదరాబాద్ ని రాత్రి రాత్రికి తరలి వచ్చి విజయవాడలో చేరడం, టీడీపీ వాళ్ళు అవినీతి ఊబిలో కూరుకుపోయి చేసిన ఆర్థిక అనర్థాలేనని తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ బాగా తెలుసు. ప్రస్తుత ధరల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 2,19,518/- (2022-23). భారతదేశం యొక్క తలసరి ఆదాయం రూ. 1,72,000/- (2022-23). అంటే 2022-23లో రాష్ట్ర తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే 27.6% ఎక్కువ. తలసరి ఆదాయం అంశంలో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో మెరుగ్గా ఉంది. వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయికి లెక్క ఉంది. ప్రతి పైసా ప్రజలకు అవినీతి లేకుండా వారి ఖాతాలకు జమ అయింది. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నవరత్నాలలో భాగముగా 26 సంక్షేమ పథకాలకు ఎస్సి, ఎస్టి, బీసి, పేద ,మధ్యతరగతి ప్రజలకు నేరుగా సుమారు రూ 2,05,109 కోట్లు డీబీటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తుంటే ప్రతిపక్షాలు కడుపు మంటతో అర్థం లేని విమర్శలు చేయడం శోచనీయం. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సిఫారసు మేరకు, రాజకీయ నాయకుడికి దగ్గరగా ఉన్న అనుకూల వర్గాల వారినే లబ్ధిదారులుగా ఎంచుకున్నారు. వారి లక్ష్యం స్వార్థపూరితం.. కావడం వల్ల అర్హత ఉన్నా కూడా ఫలాలు అందని పేద ప్రజలెందరో నాటి ప్రభుత్వ హయాంలో. కానీ ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హత ఉన్న ప్రతి లబ్ది దారునికి కుల,మత, ప్రాంత,వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుంది. ఎవరి సిఫారసులు అక్కర లేదు.. కేవలం అర్హతే ప్రామాణికం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, నిర్వహణ, అప్పులు, వడ్డీ, తలసరి ఆదాయం, ఎస్.డీ.జీ , డీ.బీ.టీ ఇలా అన్నింటిలో వాస్తవాలు వేరు. యనమలగారు , చంద్ర బాబు నాయుడు గారి దుష్ప్రచారంలో చెప్పే లెక్కలు వేరు. పత్రికా ప్రకటనల్లో రాసే ప్రతి అక్షరం ఓ అబద్ధం. అప్పులు, వడ్డీలు, తలసరి ఆదాయం, %ాణ+, ఐదీ% లెక్కలపై సరైన అవగాహన లేకుండా ప్రభుత్వ ప్రతిష్టను అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా లెక్కలన్నీ పూర్తిగా కల్పితం. ప్రతిపక్ష నాయకులు, కొన్ని పత్రికలు స్వార్థంతో చేసిన కపట నాటకాలనడానికి.. పైన పేర్కొన్న వాస్తవ గణాంకాలే ఉదాహరణ. అని మంత్రి బుగ్గన అన్నారు.

# టీడీపీతో పెట్టుకోవద్దు... కేతిరెడ్డికి పరిటాల హెచ్చరిక

అనంతపురం: వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుడ్ మార్నింగ్ తప్ప వేరే వ్యాపార వ్యవహారాలు లేని కేతిరెడ్డికి వందల ఎకరాలు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించారు. "నీ కథలు అందరికి తెలుసు..పిచ్చి మాటలు ఆపు. నీపైన వేసే సిట్ విచారణకు సిద్ధంగా ఉండు" అంటూ హెచ్చరించారు. వైసీపీ ఎమ్మెల్యేల చేతుల్లో ఉద్యోగులు ఇరుక్కుపోతున్నారని మండిపడ్డారు. 25 ఎకరాలను కొనుగోలు చేసి 40 ఎకరాలను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎన్వోసీలు ఇవ్వకపోవడంతో కలెక్టర్‌ను దూషించారని అన్నారు. నియోజకవర్గం నుంచి అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. "టీడీపీతో పెట్టుకోవద్దు...నీ చరిత్ర బయట పెడుతాం" అంటూ పరిటాల శ్రీరామ్ హెచ్చరించారు.






# నైట్ పార్టీలో నాటీ అందాలు..!

బాలీవుడ్ హీరోయిన్స్ లో కొన్ని సినిమాలే చేసినా తనకంటూ ఒక మార్క్ వేసుకుంది అమృత అరోరా. %మీజ% లో వీజే గా మొదలైన అమ్మడి కెరియర్ ఆ క్రేజ్ తో హీరోయిన్ గా ఛాన్స్ దక్కించుకుంది. కెరియర్ మొదట్లోనే చేసిన సినిమాలన్ని ఫ్లాప్ అవగా లెస్బియన్ సినిమా గర్ల్ ఫ్రెండ్ తో తొలి హిట్ కొట్టింది అమృత. 2002 నుంచి 2009 వరకు వరుస సినిమాలు చేస్తూ వచ్చిన అమృత అరోరా ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలకు దూరమైంది. అప్పట్లో హీరోయిన్స్ కి పెళ్లి జరిగితే ఇక వారి కెరియర్ ముగిసినట్టే. ఆ క్రమంలోనే పెళ్లి తర్వాత పూర్తిగా సినిమాలకు దూరమైంది అమృత. అయితే ఆఫ్టర్ లాంగ్ గ్యాప్ 2015లో ఒక సినిమాలో నటించింది. అమృత అరోరా సినిమాలు చేయకపోయినా ఆమె ప్లేస్ లో ఆమె సోదరి మలైకా అరోరా బాలీవుడ్ లోకి వచ్చింది. మలైకా దూకుడు గురించి అందరికి తెలిసిందే. అమ్మడు స్పెషల్ సాంగ్స్ కి క్రేజీ ఫ్యాన్స్ ఉన్నారు. అమృతని



ఇష్టపడే వారికి మలైకా కూడా ఆల్టర్నేట్ గా మారింది. అందుకే ఆమెకు సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. సినిమాలకు దూరమైనా సరే అమృత అరోరా సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటుంది. ఇక బాలీవుడ్ పార్టీల్లో అమృత స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తుంది. ఇప్పటికీ సినిమాలు చేయకపోయినా సరే అమృత అదే ఫాలోయింగ్ కొనసాగిస్తుంది. లేటెస్ట్ గా అమృత తన ఫ్యామిలీతో నైట్ పార్టీలో పాల్గొన్నది. పార్టీ పూర్తి టైం లో అమృతని మీడియా కెమెరాలు క్లిక్ అనిపించాయి. టాప్ గా షర్ట్ ఒకటి వేసుకున్న అమ్మడు ఈ వయసులో కూడా గ్లామర్ ట్రీట్ ఇస్తుంది. పస్తుతం అమృత అరోరా ఈ స్పెషల్ ఫోటోస్ బాలీవుడ్ మీడియా సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారాయి. పార్టీ మూడ్ లో ఉన్న అమ్మడు ఇప్పటికీ తన అందంతో ఎట్రాక్ట్ చేస్తుంది. మళ్లీ ఈమధ్య సినిమాలకు గ్యాప్ ఇచ్చిన అమృత సరైన ఛాన్స్ వస్తే మాత్రం అసలు వదలనని అంటుంది. అమృత అరోరా లేటెస్ట్ ఫోటోలు ఆమె ఫ్యాన్స్ ని అలరిస్తున్నాయి.

# ఛాన్సులు లేక సోనాక్షి అలా చేస్తోందా?

హీరోయిన్ల మధ్య పోటీ వాతావరణం గురించి చెప్పాల్సిన పనిలేదు. కళ్లు మూసి తెరిచే లోపు ఒకరి అవకాశం మరొకరు ఎగరేసుకుపోతారు. పోటీ వరల్డ్ లో దూసుకురావాలంటే అంతే వేగంగా పనిచేయాలి. నిర్ణయాలు సైతం అంతకు మించి వేగంగా తీసుకోవాలి. లేదంటే పుణ్య కాలం కాస్త గడిచిపోతుంది. ట్రెండ్ కి తగ్గట్టు అంతే వేగంగాను పనిచేయాలి. హీరోయిన్ గా రాణించాలంటే ఇంకా చాలా రకాల టెక్నికల్ తెలిసి ఉండాలి. వారసురాళ్ల మధ్య పోటీ తలెత్తితే వాతావరణం యుద్ధాన్ని తలపిస్తుంది. నువ్వెంతంటే? నువ్వెంత అనుకునే స్థాయికి వివాదం చేరుతుంది. ఇక బాలీవుడ్ గురించి చెబితే రెండున్నరేళ్లగా అక్కడ పరిశ్రమ పరిస్థితి పూర్తిగా దిగజారింది. సక్సెస్ రేట్ తగ్గిపోవడంతో సినిమా నిర్మాణం తగ్గింది. ముఖ్యంగా మీడియం బడ్జెట్ సినిమాలు బాగా తగ్గాయి. స్టార్ హీరోలు మూడు నాలుగేళ్లకు ఒక సినిమా మాత్రమే చేస్తున్నారు. వాళ్ల సరసన టాప్ మోస్ట్ హీరోయిన్లే పనిచేస్తారు. అంతకుమించి కింద స్థాయి



హీరోయిన్ తీసుకోవడం కష్టమైన పని. దీంతో కొత్త వాళ్లు సహా పేరు సంపాదించిన హీరోయిన్లు కూడా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితు లొస్తున్నాయి. తాజాగా ముకు పుడకల సుందరి సోనాక్షి సిన్హా తీరు చూస్తే అలాగే కనిపిస్తుంది. ఈ భామకి కొంత కాలంగా సరైన విజయాలు లేక రేసులో వెనుకబడింది. అలా వెనుకబడటంతో అవకాశాలకు దూరమవుతోంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో 'డబుల్ ఎక్స్ ఎల్'..'కాకుడా' చిత్రాలున్నాయి. కొత్త కమిట్ మెంట్లు ఏవి లేవు. అందుకేనేమో బ్యూటీ ఇప్పుడు లేడీ ఓరియేంటెడ్ చిత్రాల వైపు దృష్టి మళ్లించిన్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం హ్యూమా ఖురేషీ తో కలిసి డబుల్ ఎక్స్ లో నటిస్తోంది. ఇందులో ఇద్దరు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సినిమా ఆ రెండు పాత్రల చుట్టూనే తిరుగుతుంది. తాజాగా సోనాక్షి అప్ కమింట్ ప్రాజెక్ట్ కూడా ఇలాగే ప్లాన్ చేసింది. ఆమెకు తోడుగా వాణీ కపూర్ ని తెచ్చుకుని 'ఏగర్ల్ ఇన్ ద ఎల్లో సూట్ కేస్' చిత్రాన్ని పట్టాలెక్కించబోతుంది. ఇందులో సోనాక్షితో కలిసి వాణీ కపూర్ నటించనుంది. ఇది లేడీ ఓరియేంటెడ్ థ్రిల్లర్ జానర్ చిత్రమే. దీనికి జాతీయ ఉత్తమ దర్శకుడు ఆషీమ్ అహ్లువాలి యా దర్శకత్వం వహించనున్నారు. సోనాక్షి కొత్త కమిట్ మెంట్లు చూస్తుంటే హీరోల సరసన అవకాశాలు రాకపోవడంతోనే ఇలా ప్లాన్ డ్ గా ఫేమ్ ఉన్న హీరోయిన్ల తో కలిసి ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

# ట్రెండీ స్టోరి: పుట్టుమచ్చలతోనే కొల్లగొట్టారు!



పుట్టుమచ్చ కొందరికి అందం పెంచుతుంది. అది ఉన్న స్థానాన్ని బట్టి ఆ అందం డబుల్ ట్రిపుల్ కూడా అవుతుంది. సెక్సప్పీల్ ని కూడా పెంచుతుంది. అందాల నయనతారకు పెదవి పై అంచున ఉన్న పుట్టుమచ్చ సంథింగ్ స్పెషల్ అని అభిమానులు చెబుతుంటారు. సీనియర్ నటి రేఖ– అలియా భట్ – కియారా అద్వానీ –అనుష్క శర్మ– నీతి టేలర్ ఇలా భామల అందాన్ని పుట్టుమచ్చలు ప్రత్యేకంగా ఇనుమడింపజేశాయని అభిమానులు చెబుతుంటారు. బయటికి కనిపించే పుట్టుమచ్చల వెనక చాలా అర్థం ఉంటుందని జ్యోతిష్యం చెబుతోంది. నిజానికి జ్యోతిష్కుల ప్రకారం దాని అర్థం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఆసక్తికర విషయాలే తెలిసాయి.

**సీనియర్ నటి రేఖ – అందమైన పుట్టుమచ్చ వెనక స్టోరి...!**

ఎవర్ గ్రీన్ నటి రేఖ తన పై పెదవికి పైన ఉన్న పుట్టుమచ్చతో ఎంతో ఆకర్షణ ఉన్న నటిగా పాపులరైంది. అయితే ఈ పుట్టుమచ్చ ఒరిజినల్ కాదన్న సంగతి ఎందరికి తెలుసు? ఇది కృత్రిమమైనదని ఆమె స్వయంగా వెల్లడించింది. అయితే అందాల మచ్చలు ఉన్న బాలీవుడ్ నటీమణులు చాలా మంది ఉన్నారు. ఈ మచ్చలు ఆస్ట్రాలజీ ప్రకారం దేనిని సూచిస్తాయి? అన్నది కూడా ఆసక్తికరం.

**కియారా అద్వానీ** – కియారా అద్వానీకి గడ్డం ఎడమ వైపున పుట్టుమచ్చ ఉంది. జ్యోతిష్యం ప్రకారం... ఎడమ వైపున ఉన్న పుట్టుమచ్చ అతను/ఆమె పూర్తిగా నిజాయితీతో ఉంటుందని ఇండికేషన్. అలాగే మొద్దుబారిన వ్యక్తిత్వం వారిది అని సూచిస్తుంది.

**అలియా భట్** – ఆర్.ఆర్.ఆర్ లో సీతగా నటించి మెప్పించిన అలియా భట్ కి తన నుదిటికి కుడి వైపున కనిపించే బ్యూటీ స్పాట్ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమె అందమైన వ్యక్తిని వివాహం చేసుకుంటుందని ఈ మచ్చ సూచిస్తుందనేది జోస్యం. తాను కోరుకున్న అందగాడినే ఆలియా పెళ్లాడింది.

**అనుష్క శర్మ** – అనుష్క శర్మకు కూడా ఆమె గడ్డం మీద దాదాపు దవడ పై పుట్టుమచ్చ ఉంది. దీని అర్థం.. ఆప్యాయతలో కొండంత.. శ్రద్ధగా ఉండటంలో ఆకాశం ఎత్తున ఉంటారని ...ఇది సూచిస్తుంది. అనుష్క శర్మ నటిగా నిర్మాతగా కూడా ఫెయిల్ కాకపోవడానికి ఆ రెండూ ప్రధాన కారణాలు. వ్యక్తిగత జీవితంలోను తాను కోరుకున్న క్రికెటర్ ప్రియుడు విరాట్ ని కొంగున కట్టేసుకుందంటే అనుష్క వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి.

**శ్రద్ధా కపూర్** – శ్రద్ధా కపూర్ తన కింది పెదవి దిగువన అందమైన స్పాట్ ని కలిగి ఉంది. పెదవి కింద పుట్టుమచ్చ ఉన్నవారికి థియేటర్ రంగంపై అమితాసక్తి ఉంటుందని జ్యోతిష్యం సూచిస్తుంది. ఆషిఖి 2 –ఏక్ విలన్– సాహెూ చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల హృదయాలను శ్రద్ధా కొల్లగొట్టింది. నటిగా తనను తాను నిరూపించుకుంది.

**కత్రినా కైఫ్** – కత్రినా కైఫ్ పెదవి పైన పుట్టుమచ్చతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఇది ప్రకృతితో మమేకమయ్యే వ్యక్తిత్వాన్ని.. ఆహార ప్రియత్వాన్ని సూచిస్తుంది. జీవితంలో అత్యుత్తమమైన వాటిని సాధించేందుకు కూడా ప్రయత్నాలు సాగుతాయని ఈ మచ్చ చెబుతుంది.

**నయనతార** – నయనతార పుట్టుమచ్చ నిజానికి ఆమె అందానికి USP. ఆ దోర దొండ పెదవుల పైన మధ్యలో ఒక పుట్టుమచ్చ ఎంతో మనోహరంగా ఉంటుంది. ఇది నాయకురాలు కాబోయే లక్షణం. తలైవి అన్న పిలుపు కూడా అందుకే నయన్ కి యూనిక్ గా దక్కింది. ప్రజలచే ఆమోదించబడిన గొప్ప వ్యక్తిత్వం అని ఈ పుట్టుమచ్చ సూచిస్తుంది. ప్రస్తుతం సినీకెరీర్ లో బిజీగా ఉన్న నయనతార భవిష్యత్ లో నాయకురాలు అవుతుందేమో చూడాలి. ఇటీవలే విఘ్నేష్ తో సరోగసీలో నయన్ బిడ్డను కన్న సంగతి తెలిసిందే.

# టబు బర్త్ డే.. ఎంజాయ్ చేసిన ఆ ముగ్గురు..!



అందాల భామ టబు రీసెంట్ గా తన 52 వసంతాలను పూర్తి చేసుకుని 53వ వసతంలోకి అడుగు పెట్టింది. తెలుగు అమ్మాయే అయినా టాలీవుడ్ లో కొన్ని సినిమాలు చేసి బాలీవుడ్ వెళ్లిన అమ్మడికి అక్కడ స్టార్ క్రేజ్ కట్టబెట్టారు బాలీవుడ్ ఆడియన్స్. ముఖ్యంగా అక్కడ ప్రేక్షకులను తన రొమాంటిక్ ఉచ్చులో పడేలా చేసింది టబు. తెలుగులో చేసిన కొన్ని సినిమాలకే ఇక్కడ కూడా హాట్ ఇమేజ్ సొంతం చేసుకోగా అది బాలీవుడ్ లో కూడా కొనసాగిస్తూ వచ్చింది. తెలుగులో చాలామంది స్టార్స్ కి ఇప్పటికీ టబు టచ్ లో ఉంటుంది. టబు బర్త్ డే సందర్భంగా తన ఇంట్లో కేక్ కట్ చేసింది. ఈ పార్టీలో బాలీవుడ్ డ్యాన్సర్ డైరక్టర్ ఫరా ఖాన్ అటెండ్ అయ్యారు. ఆమెతో పాటుగా మరో హీరోయిన్ శిల్పా శెట్టి కూడా వచ్చారు. టబు బర్త్ డే పార్టీలో వీరి హంగామా ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ న్యూస్ గా మారింది. అంతేకాదు టబు బర్త్ డే సందర్భంగా పైజామా పార్టీ చేసినట్టు ఫరా ఖాన్ తన ఇన్ స్టా పేజ్ లో రాసుకొచ్చారు. టబుతో తనకు 30 ఏళ్ల అనుబంధమని అన్నారు. ఇండియన్ హీరోయిన్స్ లో టబుకి సెపరేట్ స్టైల్ ఉంది. ఇటు మంచి అభినయంతో మెప్పిస్తూనే అదే రేంజ్ లో తన అందాలతో అలరించింది. నిన్నటితరం గ్లామరస్ బ్యూటీగా టబు తన సత్తా చాటింది. బాలీవుడ్ లో ఆమె గ్లామర్ సైడ్ చేయని ప్రయోగాలు లేవు. ఫీమేల్ సెంట్రిక్ సినిమాలతో కూడా మెప్పించింది టబు. బాలీవుడ్ లో సెటిల్ అయిన టబు ఇప్పటికీ తెలుగు పరిశ్రమలో మంచి అవకాశం వస్తే చేస్తానని అంటుంది. టబు చివరగా తెలుగులో అల వైకుంఠపురములో సినిమాలో నటించింది. ఇప్పుడు వస్తున్న భామలు ఇంటిమేట్ సీన్స్ లో రెచ్చిపోతున్నారు కానీ అప్పట్లోనే తన బోల్డ్ సీన్స్ తో బాక్సాఫీస్ ని షేక్ చేసింది టబు. అందుకే ఇప్పటికీ ఆమె అంటే ఇష్టపడే అభిమానులు ఉన్నారు. కథ డిమాండ్ చేస్తే తన కన్నా చిన్న వారితో కూడా రొమాన్స్ చేసేందుకు టబు రెడీ అంటుంది. అలా తన కెరియర్ లో ఇలాంటి ప్రయోగాలు చాలా చేసింది. 53 ఏళ్లు వచ్చినా టబు ఇంకా యంగ్ హీరోలతో రొమాంటిక్ సినిమాలు చేస్తూ వస్తుంది. బాలీవుడ్ లో తనకు వచ్చిన ఈ క్రేజ్ తో మరిన్ని ప్రయోగాలు చేయాలని చూస్తుంది టబు. ప్రస్తుతం ఫరా ఖాన్ షేర్ చేసిన టబు బర్త్ డే పిక్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి.

# బాలీవుడ్ కు నేచురల్ స్టార్ హీరోయిన్?

టాలీవుడ్ కోలీవుడ్ లలో మంచి పేరుతెచ్చుకున్న హీరోయిన్ లు ఇప్పుడు బాలీవుడ్ బాటపడుతున్న విషయం తెలిసిందే. అక్కడ తమ అదృష్టాన్ని పరీక్షించుకని దేశ వ్యాప్తంగా క్రేజ్ ని సొంతం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ఈ బాటలో నేచురల్ స్టార్ నాని హీరోయిన్ నడవబోతోంది. విభిన్నమైన సినిమాలతో హీరోయిన్ గా తమిళ తెలుగు భాషల్లో మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్. 'కౌసల్యా కృష్ణమూర్తి' వంటి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఐశ్వర్యా రాజేష్ ఆ తరువాత మిస్ మ్యాచ్ విజయ్ దేవరకొండతో 'వరల్డ్ ఫేమస్ లవర్' నేచురల్



స్టార్ నానితో 'టక్ జగదీష్' వంటి సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. సాయి ధరమ్ తేజ్ నటించిన 'రిపబ్లిక్'మూవీలోనూ నటించినా ఆ మూవీ ఆశించిన ఫలితాన్ని అందించకపోవడంతో ఐశ్వర్యా రాజేష్ తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాల్ని సొంతం చేసుకోలేకపోయింది. అర్జున్ రాంపాల్ స్టోరీ స్క్రీన్ ప్లే అందించి నటించిన 'డాడీ' సినిమాతో బాలీవుడ్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రయత్నించింది. 2017లో విడుదలైన ఈ మూవీ ఐశ్వర్యా రాజేష్ కి పెద్దగా గుర్తింపుని తెచ్చిపెట్టలేకపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు మరోసారి బాలీవుడ్ లో తన సత్తా చాటాలనే ప్రయత్నాల్లో వుంది ఐశ్వర్యా రాజేష్. ప్రస్తుతం డజనుకు పైగా సినిమాలున్నాయి. ఇందులో 'డ్రైవర్ జమున' పేరుతో రూపొందిన యాక్షన్ డ్రామా నవంబర్ 14న విడుదలకు సిద్ధమవుతోంది. ఇదిలా వుంటే మరోసారి బాలీవుడ్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అవుతోంది ఐశ్వర్యా రాజేష్. ఎండేమోల్ షైన్ ఇండియా నట్మెగ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో 'మాణిక్' అనే మూవీని నిర్మిస్తున్నాయి. ఐవ్వర్యా రాజేష్ తో పాటు ఈ మూవీలో సంయుక్త షణ్ముగనాథన్ వివేక్ ప్రసన్న సాయ్ జనని స్వర కాంబ్లీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళంతో పాటు హిందీలోనూ ఈ మూవీని ద్వి భాషా చిత్రంగా నిర్మిస్తున్నారు. సామ్రాట్ చక్రవర్తి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీతో అయినా ఐశ్వర్యా రాజేష్ బాలీవుడ్ లో మరిన్ని అవకాశాల్ని దక్కించుకుంటుందేమో చూడాలి.

# కంగనా కొత్త డిమాండ్.. ట్విట్టర్ ఒప్పుకుంటుందా?

ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక ప్రజాధరణ కలిగిన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్విట్టర్ ను ఇటీవలే ఎలాన్ మస్క్ కొనుగోలు చేసి విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్న విషయం తెల్సిందే. ప్రపంచ వ్యాప్తంగా ట్విట్టర్ గురించి ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలోనే ట్విట్టర్ కి సంబంధించిన పలు సూచనలు సలహాలను జనాలు ఎలాన్ మస్క్ కి ఇస్తున్నారు. ఎలాన్ మస్క్ ప్రస్తుతం ఇండియా పై దృష్టి పెట్టాడని.. ఇండియాలో బ్లూ టిక్ ఉన్న వారి నుండి భారీ మొత్తంలో డబ్బు వసూళ్లు చేయబోతున్నట్లుగా గత కొని రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ సమయంలోనే ఇండియాలో ట్విట్టర్ కొత్త పాలసీలను తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు



చేస్తున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ట్విట్టర్ లో బ్లూ టిక్ ఉన్న వారు ఇక నుండి 8 డాలర్ల చొప్పున నెల నెలకు చెల్లించాల్సి ఉంటుందట. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన రాబోతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. ఇక తాజాగా ట్విట్టర్ బ్లూ టిక్ విషయంలో కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలను చేయడం జరిగింది. ట్విట్టర్ లో ఫేక్ అకౌంట్స్ విషయంలో మస్క్ జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించడంతో పాటు బ్లూ టిక్ కలిగి ఉన్న వారి యొక్క ఆధార్ ను ట్విట్టర్ అకౌంట్ కు లింక్ చేయాలని ఆమె సూచించింది. ఒక వేళ ట్విట్టర్ అకౌంట్ కి ఆధార్ లింక్ చేస్తే తప్పకుండా చాలా వరకు అసత్యాలు ప్రచారం అవ్వవు అని.. ఒకరి పై ఒకరు దూషణలకు దిగరు అన్నట్లుగా ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. వెరిఫికేషన్ తో ఇచ్చే బ్లూ టిక్ ను తప్పనిసరిగా ఎక్కువ శాతం మందికి ఇవ్వాలి అంటూ కూడా ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వెరిఫికేషన్ విధానం కొద్ది మందికి మాత్రమే ఎందుకు పరిమితం అవుతుందో తనకు అర్థం కావడం లేదు అన్నట్లుగా ఈ సందర్భంగా కంగనా చెప్పుకొచ్చింది. మరి కంగనా యొక్క సలహాను.. డిమాండ్ ను మస్క్ పట్టించుకుంటాడా అనేది చూడాలి.




హైదరాబాద్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్‌లో వైరల్ అవడాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఘటనపై ఆరా తీసిన ఆమె.. వరంగల్, హనుమకొండ డీఈవోలతో ఇప్పటికే మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలి రెండు రోజులు వరుసగా తెలుగు, హిందీ ప్రశ్నపత్రాలు బయటకు రావడంపై ఆమె స్పందిస్తూ.. పరీక్షల నిర్వహణ విషయంలో వ్యవహరించాల్సిన తీరుపై వివిధ శాఖల అధికారులకు ట్విటర్ ద్వారా పలు సూచనలు చేశారు. "పదో తరగతి పరీక్షల విషయంలో జిల్లాల కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, పోలీసు విభాగం, పోస్టల్, వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. 4.95 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా పనిచేద్దాం. మొదటిసారి బోర్డు పరీక్షలు రాస్తున్న చిన్నారులను గందరగోళానికి గురిచేయాలని ఎవరు ప్రయత్నించినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.

విద్యార్థుల భవిష్యత్తు విషయంలో రాజకీయ, వ్యక్తిగత స్వార్థాన్ని వీడాలి" అని మంత్రి సబిత విజ్ఞప్తి చేశారు. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రశ్నపత్రాలు బయటకు రావడంపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలతో సాయంత్రం 5 గంటలకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

## సీఎం కేసీఆర్ కుటుంబం ఆస్తి రూ.లక్ష కోట్లు: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: సీఎం కేసీఆర్ కుటుంబ ఆస్తి రూ.లక్ష కోట్లకు చేరిందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై ఒక్క కేసు అయినా పెట్టారా? అని ప్రశ్నించారు. భాజపా, భారాస మధ్య సంబంధాలు ఉన్నాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. సంబంధం లేకపోతే కేసీఆర్ ఆస్తులపై ఎందుకు విచారణ చేయట్లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిపై ఇప్పటి వరకు 50 ఫిర్యాదులు చేశానని.. ఒక్క దానిపై కూడా చర్యలు తీసుకోలేదన్నారు. "రాష్ట్రంలో 80శాతం మంది కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ప్రజలు తమ వ్యూహాన్ని రూపొందించుకుంటున్నారు.. దానికి అనుగుణంగా రాజకీయ పార్టీలు అడుగులు వేస్తున్నాయి. పదేళ్లలో .. రాష్ట్రంలో భారాస, కేంద్రంలో భాజపా చేసిందేమిటో ప్రజలకు చెప్పగలరా? నీటిపారుదల విషయంలో కేసీఆర్ అబద్ధాలు చెబుతున్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. ఇప్పుడు దాన్ని కేసీఆర్ మార్కెటింగ్ చేసుకున్నారు. పాదయాత్రలో అనేక విషయాలు స్థానిక ప్రజలకు సవివరంగా చెప్పగలిగాం. ప్రజలు అడిగినవి పక్కనపెడితే.. కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? టీచర్ నియామకాలు చేపట్టారా? తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోసం రాష్ట్రాన్ని సాధించుకున్నారు. ఇప్పుడు ఆ స్వేచ్ఛనే కేసీఆర్ గుంజుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు 80 సీట్లు ఇస్తారు. కేసీఆర్‌కు 25 సీట్లు లోపే ఉంటాయి. భాజపా సింగిల్ డిజిట్‌లో ఉంటుంది. నేను ఏ సర్వేలు చూడను.. ప్రజలతో అనుబంధం, వారితో మాట్లాడిన తర్వాతే ఈ విషయం చెబుతున్నా. ఈసారి కొడంగల్‌లో పోటీ చేయాలని అనుకుంటున్నా. ఇదే విషయాన్ని పార్టీకి చెప్పా. 6 నెలల ముందే టికెట్లు ప్రకటించాలని మిత్రుల నుంచి సూచనలు వచ్చాయి. పరిశీలనలో ఉంది" అని రేవంత్‌రెడ్డి వివరించారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సీఎం కేసీఆర్ సమీక్ష



హైదరాబాద్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులతో కేసీఆర్ సమీక్షిస్తున్నారు. హుస్సేన్ సాగర్ తీరంలోని ఎన్టీఆర్ గార్డెన్ వద్ద 125 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఏప్రిల్ 14న దేశంలోనే అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా దళిత బిడ్డలను హైదరాబాద్‌కు పిలిపించి.. లక్షలాది మంది మధ్య అంబేద్కర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించనున్నారు. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది.

## బీజేపీలో చాలామంది మున్నాభాయి ఎంబీబీఎస్‌లు ఉన్నట్లున్నారు.. మంత్రి కేటీఆర్ ట్వీట్



ప్రధాని మోదీ ఏం చదివారో బయటపెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో పలువురు బీజేపీ నేతల విద్యార్హతలు, వాళ్ల నకిలీ సర్టిఫికెట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో పలువురు బీజేపీ నేతల విద్యార్హతలపై మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీలో ఎంతోమంది మున్నాభాయి ఎంబీబీఎస్ ఉన్నట్లున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం నాడు ట్వీట్ చేశారు. తెలంగాణకు చెందిన ఇద్దరు బీజేపీ ఎంపీలు కూడా నకిలీ సర్టిఫికెట్లు కలిగి ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో తెలిపారు. వాళ్ల దగ్గర రాజస్థాన్, తమిళనాడు యూనివర్సిటీల పేరుతో నకిలీ సర్టిఫికెట్లు ఉన్నాయని అంటున్నారని పేర్కొన్నారు. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించి.. ఎన్నికల్లో గెలవడం నేరం కాదా? అని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రశ్నించారు. వాటిని పరిశీలించి నేరం రుజువైతే అనర్హత వేటు వేస్తారా? అని లోక్‌సభ స్పీకర్‌ను ప్రశ్నించారు.

## బీఆర్ఎస్‌పై ట్విట్టర్ వేదికగా బండి సంజయ్ సెటైర్లు



హైదరాబాద్: అధికార బీఆర్ఎస్ పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ట్విట్టర్ వేదికగా సెటైర్లు విసిరారు. లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో చ%ఒఘఠవతీఅశ్రీశ్రీబ% వేదికను పంచుకున్నారని యెద్దేవా చేశారు. గవర్నర్‌ను దుర్భాషలాడిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్‌గా పదోన్నతి పొందారని తెలిపారు. లైంగిక ఆరోపణలు ఉన్న మాజీ మంత్రితో కేసీఆర్ వేదిక పంచుకున్నారని, మరో మంత్రి.. ప్రతిపక్ష నేతను మంగళవారం మర్దలు అంటూ పిలిచారని మండిపడ్డారు.

మహిళా ప్రభుత్వ ఉద్యోగినిపై బీఆర్ఎస్ మంత్రి సెక్సిస్ట్ వ్యాఖ్యలు చేయడంతో సీఎం ప్రశంసలు అందుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అనుచరులు బీఆర్ఎస్ మహిళా నాయకులపై సోషల్ మీడియాలో దారుణమైన దుర్వినియోగాలతో దాడి చేశారని.. అయినప్పటికీ అరెస్ట్ కాలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అర్థాన్ని బండి సంజయ్ తనదైన రీతిలో వివరించారు. B అంటే బలత్కరీస్.. R అంటే రేపిస్టులు.. అంటే లైంగిక వేధింపులు అంటే వ్యాఖ్యలు చేశారు. నాయకుడు ఎలా ఉంటే... అనుచరులూ అలాగే ఉంటారు అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు.

## తెలంగాణలో పేపర్ లీకేజీలపై విజయశాంతి ఆగ్రహం



హైదరాబాద్: తెలంగాణలో పేపర్ లీకేజీలపై బీజేపీ నేత విజయశాంతి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తెలంగాణలో విద్యార్థిగా, ఉద్యోగార్థిగా బతకడమంటే దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా పరిస్థితి మారిపోయిందన్నారు. రాష్ట్ర పాలకుల బాధ్యతారాహిత్యం వల్ల మొన్నటికి మొన్న ప్రభుత్వ ఉద్యోగాలకి పరీక్షలు పెట్టే టీఎస్‌పీఎస్‌సి ప్రశ్నాపత్రాలు లీకవగా... ఇప్పుడు 10వ తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలి రోజే తెలుగు పరీక్ష ప్రశ్నాపత్రం, ఈ రోజున హిందీ పేపర్ లీకయ్యాయని అన్నారు. ఎక్కడా కట్టుదిట్టమైన చర్యలు లేవని.. భద్రతా వ్యవస్థలు లేవని.. సరైన పద్ధతులు లేవని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలంటే ప్రభుత్వానికి ఒక ఆటగా మారిపోయిందని బీజేపీ నేత మండిపడ్డారు. నిరాశతో బలవన్మరణాలకు పాల్పడుతున్నప్పటికీ ఈ సర్కారు ఏ మాత్రం పట్టింపులేని తీరును ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇదిలా ఉంటే మరోవైపు కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అంశాన్ని కూడా సర్కారు అటకెక్కించిందన్నారు. దీనిపై సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి ఏడాది గడిచినా కదలిక లేని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే కాంట్రాక్ట్ ఉద్యోగులు చాలామంది పాతిక, ముప్పైయ్యేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని రెగ్యులరైజేషన్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారని తెలిపారు. వీరు రిటైర్ అయ్యేలోగానైనా రెగ్యులరైజ్ అవుతారో లేదో ఆ దేవుడికే ఎరుక అని... వీలైనంత మందిని రిటైర్ చేయించి... తక్కువలో తక్కువ మందికి మాత్రమే ఆర్థిక ప్రయోజనాలు కల్పించి డబ్బులు మిగుల్చుకోవాలనే కుట్ర కోణం కూడా ఇందులో కనిపిస్తోందని విజయశాంతి వ్యాఖ్యలు చేశారు.




**తెలంగాణలో పదో తరగతి హిందీ పరీక్ష ప్రారంభమైన కాసేపటికే.. ప్రశ్నపత్రం వాట్సప్‌లో వైరల్ కావడంపై వరంగల్ సీపీకి ఫిర్యాదు చేసినట్లు డీఈవో వాసంతి వెల్లడించారు. ప్రశ్నపత్రం ఏ జిల్లాలో ఎవరు బయటకు పంపారో తేలాల్సి ఉందన్నారు. ఈ మేరకు ప్రశ్నపత్రం ఎక్కడ్నుంచి బయటకు వెళ్లిందనేది తనకు తెలియదని చెప్పారు. అయితే, వాట్సప్‌లో ఉన్న ప్రశ్నపత్రం, ఇవాళ జరిగిన పరీక్షతో సరిపోలిందని తెలిపారు.**




## వరుసగా రెండో రోజు లీక్.. వాట్సాప్‌లోకి హిందీ ప్రశ్నపత్నం..

వరంగల్: తెలంగాణ పదో తరగతి పరీక్షల్లో మరో ప్రశ్న పత్రం లీకైంది. రెండో రోజు హిందీ పరీక్ష ప్రారంభమైన కాసేపటికే ఆ పేపర్ వాట్సాప్‌లో వైరల్ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రశ్నపత్రం లీకైనట్లు తెలుస్తోంది. అయితే దీనిపై విద్యాశాఖ అధికారు లకు కూడా స్పష్టత లేదు. హిందీ ప్రశ్నపత్రం బయటకు ఎలా వెళ్లిందనే విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. హనుమకొండలోని ఉప్పల్ పరీక్షా కేంద్రం నుంచి ప్రశ్నపత్రం లీకైందనే ప్రచారంతో అక్కడి సిబ్బందిని తహసీల్దార్, సీఐ విచారించారు. అయితే తమ కేంద్రం నుంచి పేపర్ లీక్ కాలేదని పరీక్షా కేంద్రం సిబ్బంది తెలిపినట్లు సమాచారం.

**మంత్రి సబిత ఆరా** హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్‌లో వైరల్ కావడంపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరా తీశారు. వరంగల్, హనుమకొండ డీఈవోలతో ఆమె మాట్లాడారు. దీనిపై వరంగల్ సీపీకి ఫిర్యాదు చేయాలని మంత్రి సబిత ఆదేశించారు. దీంతో డీఈవోలు సీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు.

**ఇవాళ్టి పరీక్షతో సరిపోలింది: వరంగల్ డీఈవో వాసంతి :** వాట్సాప్‌లో వైరల్ అయిన ప్రశ్నపత్రం ఇవాళ జరిగిన పరీక్షతో సరిపోలిందని వరంగల్ డీఈవో వాసంతి తెలిపారు. ఈ ఘటనపై సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. "ప్రశ్నపత్రం ఎక్కడి నుంచి బయటకు వెళ్లిందనేది ఇంకా నిర్ధారణ కాలేదు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేశాం. ఏ జిల్లాలో ఎవరు బయటకు పంపారో తేలాల్సి ఉంది. పరీక్ష హాలులోకి ఇన్విజిలేటర్లు మినహా ఎవరికీ ప్రవేశం ఉండదు. మొబైల్ ఫోన్లు కూడా అనుమతించడం లేదు" అని వాసంతి చెప్పారు. టెన్త్ పరీక్షలు ప్రారంభమైన తొలిరోజునే తెలుగు ప్రశ్నపత్రం లీకవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సప్ గ్రూపులో ప్రశ్నపత్రం ప్రత్యక్షం కావడం సంచలనం సృష్టించింది. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి బాధ్యులను చేస్తూ నలుగురు ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో రెండో రోజు హిందీ ప్రశ్నపత్రం కూడా వాట్సాప్‌లో లీకవడం కలకలం రేపుతోంది.

## మార్గదర్శి కేసులో హైకోర్టు కీలక ఉత్తర్వులు



హైదరాబాద్: మార్గదర్శి కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. 36 మంది బ్రాంచ్ మేనేజర్లపై ఎలాంటి చర్యలు కానీ,.. అరెస్ట్ కానీ చేయొద్దని ఏపీ సీఐడీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసంది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. సీఐడీ కేసు విచారణ కొనసాగించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో ఆ సంస్థ చైర్మన్ రామోజీరావును ఏపీ సీఐడీ అధికారులు విచారించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ డబ్బులు చీటీ పాడుకున్నాక ఆ మొత్తం వినియోగదారుడికి ఇవ్వకుండా తమ సంస్థల్లోనే డిపాజిట్ చేయించారనే అభియోగాలపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. సీఆర్‌పీసీ 160 సెక్షన్ కింద రామోజీరావుతోపాటు ఆయన కోడలు, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్‌కు ఏపీ సీఐడీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. విచారణకు అనుకూలంగా ఉన్న నాలుగు తేదీలు చెప్పాలని వాటిలో పేర్కొనగా ఏప్రిల్ 3న తాను అందుబాటులో ఉంటానని రామోజీరావు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐడీ ఎస్పీ అమిత్ బర్దార్, లీగల్ అడ్వైజర్‌తోపాటు ఇతర అధికారుల బృందం హైదరాబాద్‌కు చేరుకుంది. ఇద్దరు ఐపీఎస్ అధికారులు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, మహిళా అధికారులు సహా సుమారు 20 మంది బృందం ఆరు కార్లలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని రామోజీరావు నివాసానికి సోమవారం ఉదయమే చేరుకుని.. సాయంత్రం వరకు ప్రశ్నించింది. నలుగురు కెమెరామెన్‌తో మొత్తం విచారణను రికార్డు చేసింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రామోజీరావును వైద్యుల పర్యవేక్షణలో అధికారులు విచారించారు. 'చిట్‌ఫండ్స్ చట్టానికి విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యుచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లోకి మళ్లించడంపై వివరిస్తారా' అని ఆయన్ను అడిగారు. మార్గదర్శిపై ఇప్పటి వరకూ ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదని, లక్షల మంది చందాదారులు, డిపాజిటర్ల నమ్మకం చూరగొన్న సంస్థలో ఎలాంటి తప్పులకు తాము ఆస్కారం ఇవ్వబోమని రామోజీరావు స్పష్టం చేసినట్లు తెలిసింది. గతంలో తమ సంస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు సైతం డిపాజిటర్లు ఎక్కడా రూపాయి నష్టపోలేదని, ఇప్పుడూ వారి సొమ్ము కన్నా ఎక్కువ ఆస్తి తమ వద్ద ఉందని బదులిచ్చినట్లు సమాచారం. చందాదారుల అనుమతితో సంతకం తీసుకున్న తర్వాతే ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశామని, ఎక్కడా ఏదీ దాచుకోలేదని వివరించినట్లు తెలిసింది. సోమవారం రామోజీరావును మాత్రమే విచారించామని, సంస్థ ఎండీ శైలజాకిరణ్‌ను గురువారం (6న) విచారిస్తామని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మార్గదర్శి సంస్థకు చెందిన నలుగురు మేనేజర్లు, ఒక ఆడిటర్‌ను ఏపీ సీఐడీ ఇప్పటికే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు మాత్రమే అక్కడ ఉన్నప్పటికీ.. అనారోగ్యంతో ఉన్న రామోజీరావు బెడ్‌పై పడుకునే విచారణలో పాల్గొన్న దృశ్యాలు సీఎం జగన్ మీడియాలో ప్రసారమవడం గమనార్హం. ఆ తర్వాత జగన్ అనుకూల చానళ్లలో, సోషల్ మీడియాలోనూ అవి ప్రత్యక్షమయ్యాయి.

## రాజగోపాల్‌రెడ్డి వినతిని పరిగణనలోకి తీసుకోవాలి.. డీజీపీని ఆదేశించిన హైకోర్టు



హైదరాబాద్: భద్రత పెంచాలన్న భాజపా నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత తనకు భద్రత 1o1కి తగ్గించారని, 2o2 భద్రత కొనసాగించాలని పిటిషన్‌లో కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2o2 భద్రత ఇచ్చామని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. రాజగోపాల్‌రెడ్డి ఇప్పుడు మాజీ ఎమ్మెల్యే కావున 1o1 భద్రత ఇస్తున్నామన్నారు. ఇరు వైపులా వాదనలు విన్న హైకోర్టు .. భద్రత పెంచాలన్న రాజగోపాల్‌రెడ్డి వినతిని పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. పది రోజుల్లో దరఖాస్తును పరిష్కరించాలని డీజీపీకి ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలపై మంత్రి దయాకర్‌రావు సమీక్ష

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులను ప్రత్యేకంగా కలుసుకొని వారితో మాట్లాడి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు ఇంకా జరగాల్సిన పురోగతిపై చర్చించి, సమస్యలను పరిష్కరించడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణుల నుంచే కాక ప్రజల నుంచి సైతం మంచి స్పందన వస్తుందని ఆయన వివరించారు. పాలకుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ ఆత్మీయ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పాలకుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన పలు ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణుల నుంచి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు చెప్పారు. త్వరలో పాలకుర్తి మండలంలో నిర్వహించనున్న టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు చేయాల్సిన ఏర్పాట్లపై, నిర్వహించాల్సిన గ్రామాలపై, అలాగే సమ్మేళనాలు నిర్వహించే పద్ధతిపై మంత్రి ఎర్రబెల్లి పార్టీ ముఖ్య నాయకులకు వివరించారు. పెద్ద గ్రామాలైతే ఒకటి రెండు గ్రామాలకు మించకుండా సమావేశాలు నిర్వహించాలని ఒకవేళ చిన్న గ్రామాలు ఉంటే మూడు నుంచి నాలుగు గ్రామాల వరకు ఎంపిక చేసుకుని ఏదో ఒక గ్రామంలో ఈ సమ్మేళనాలు నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ బాధ్యులు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అలాగే పార్టీకి చెందిన అనుబంధ సంఘాల నాయకులు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆసక్తిగా వచ్చే ప్రజలను అనుమతించాలని, ఆ రోజు భోజనాలు వడ్డించి అందరినీ ఆత్మీయంగా పలకరించాలని మంత్రి సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com